# ప్రజా తపన
prajathapana.com
News that matters




సుఖమయం, శుభదాయకం, అయిన లోకం సామాజిక ప్రగతి, వేడి మంచు, నల్లని వెలుగుల్లా అసంబద్ధమైనవే. అనర్థాలను సృష్టించని భౌతిక అభివృద్ధి ఉండదు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 33 బుధవారం 15 మార్చి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# నాలుగేళ్లుగా సుపరిపాలన అందిస్తున్నాం

## గవర్నర్ అబ్దుల్ నజీర్

**అమరావతి**



రాజకీయ సాధికారత లేకుండా సామజిక సమానత్వం ఎన్నటికీ సాధ్యపడదని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. మంగళవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. గవర్నర్ ఉభయసభలకు ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ప్రభుత్వంలో రాజకీయ సాధికారత కోసం క్యాబినెట్లో 70 శాతం పదవులు, 4 డిప్యూటీ సీఎం పదవులు, 70 శాతం జడ్పీటీసీ లాంటి స్థానిక సంస్థల పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకే కేటాయించామని అయన వెల్లడించారు. అంతకుముందు అసెంబ్లీకి చేరుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్కు సీఎం వైయస్ జగన్ ఘనస్వాగతం పలికారు.

సమావేశాలకు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్రాజు, లీడర్ ఆఫ్ ది హౌస్, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్రెడ్డి, మంత్రులు, అధికార సభ్యులు, ప్రతిపక్ష సభ్యులు హాజరయ్యారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తూ, ఆర్థికాభివృద్ధిలో ఏపీ ముందడుగు వేసిందని, వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాల్లో అనూహ్య ప్రగతి సాధిస్తున్నామని అన్నారు. 5 కోట్ల మంది ప్రజల

(మిగతా 2లో)



## స్మార్ట్‌ఫోన్ల పై కేంద్రం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ**

దురాక్రమణ బుద్ధితో రగిలిపోతున్న చైనాకు గట్టి దెబ్బ తీయడంలో ప్రతి అవకాశాన్నీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం వినియోగించు కుంటోంది. స్మార్ట్‌ఫోన్లలో ముందుగా ఇన్‌స్టాల్ చేసిన యాప్‌లను తొలగించే అవకాశాన్ని కల్పించే విధంగా వాటి తయారీదారులకు ఆదేశాలిచ్చేందుకు ప్రణాళిక రచిస్తోంది. అదే విధంగా మేజర్ ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌డేట్స్‌ను తప్పనిసరిగా పరీక్షించేందుకు అవకాశం ఉండేలా చేయడానికి కూడా ప్రయత్నిస్తోంది. ఈ మేరకు భద్రతా పరమైన నిబంధనలను రూపొందిస్తోంది. ఈ వివరాలను విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా తెలిపింది. గూఢచర్యం జరుగుతోందని, యూజర్ల డేటా దుర్వినియోగమవుతోందని ఆరోపణలు వస్తున్న తరుణంలో ఈ కొత్త నిబంధనలను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోంది. భద్రత దృష్ట్యా ప్రీ-ఇన్‌స్టాల్డ్ యాప్స్ పటిష్టమైనవి కాదు. చైనాతో సహా ఇతర దేశాలు దీనిని

(మిగతా 2లో)

## భోపాల్ గ్యాస్ లీక్ దుర్ఘటన లో కేంద్రానికి ఎదురుదెబ్బ

**న్యూఢిల్లీ :**



సుమారు నాలుగు దశాబ్దాల నాటి భోపాల్ గ్యాస్ లీక్ దుర్ఘటన లో బాధితలకు మరింత నష్టపరిహారం విషయంలో కేంద్రానికి ఎదురుదెబ్బ తగలింది. 1984 భోపాల్ గ్యాస్ లీక్ దుర్ఘటనలో యూనియన్ కార్బైడ్ కంపెనీ నుంచి అదనపు పరిహారం కోరుతూ కేంద్రం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారంనాడు తోసిపుచ్చింది. 1984 డిసెంబర్ 3వ తేదీ తెల్లవారుజామున భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ ఇండియా ప్లాంట్ నుంచి మిథైల్

(మిగతా 2లో)

## చలామణీలో రూ. 130 కోట్ల ఈ-రూపాయిలు




**ముంబాయి**

భారతదేశంలో డిజిటల్ చెల్లింపుల ట్రెండ్ మారుతోంది. డిజిటల్ రూపంలో చేసే నగదు చెల్లింపుల్లో డిజిటల్ రూపాయి లేదా ఈ-రూపాయి లావాదేవీలు ఉత్సాభరితంగా సాగుతున్నాయి. 2023 ఫిబ్రవరి 28 వరకు, పైలట్ ప్రాతిపదికన, మన దేశంలో రూ. 130 కోట్ల విలువైన ఈ-రూపాయలు చెలామణిలో ఉన్నాయని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్

(మిగతా 2లో)



## శ్రీలంక చెర నుంచి భారతీయ జాలర్లను విడిపించాలి..

### ప్రధాని మోదీకి స్టాలిన్ లేఖ

**చెన్నై**

శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన 16 మంది జాలర్లు, 102 మత్స్యకార బోట్లను త్వరగా విడుదల చేసేందుకు అవసరమైన దౌత్యపరమైన చర్యలను ప్రారంభించాలని కోరుతూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. పుదుకోట్టై, నాగపట్నంకు చెందిన 16 మంది జాలర్లను అరెస్టు చేయడం ఒక నెల వ్యవధిలో శ్రీలంక నావికాదళం భారత జాలర్లపై దాడి/అరెస్టు చేయడం మూడో ఘటన అని సీఎం ఎంకే స్టాలిన్ అన్నారు. భారతీయ మత్స్యకారుల సంప్రదాయ ఫిషింగ్ హక్కులకు శాశ్వతంగా రక్షణ

(మిగతా 2లో)

## కాళేశ్వరం దేశంలోనే అతిపెద్ద స్కామ్




### ఢిల్లీలో షర్మిల దీక్ష

**న్యూఢిల్లీ**

ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైయస్ షర్మిల ధర్నా నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కేసీఆర్ కాళేశ్వరం అవినీతి విచారణ జరిపించాలని డిమాండ్ చేసారు. తరువాత జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వరకు వైయస్ షర్మిల ర్యాలీ తీయడానికి ప్రయత్నించారు. పోలీసులు మధ్యలోనే బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు, వైఎస్సార్ తెలంగాణ పార్టీ శ్రేణుల మధ్య వాగ్వాదం నెలకొంది. షర్మిల మాట్లాడుతూ కాళేశ్వరం దేశంలోనే అతిపెద్ద స్కాం. 2జీ, కోల్ గేట్ స్కాంల కన్నా ఇదే పెద్దది. రూ. 1.20లక్షల కోట్ల ప్రజా ధనం కాళేశ్వరంలో పోశారు. ఇందులో వేలాది కోట్లు కేసీఆర్ దోచుకున్నారని అన్నారు. 18లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని చెప్పి, 1.5లక్షల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదు. పారింది 18లక్షల ఎకరాలు కాదని 1.5లక్షల ఎకరాలే అని అసెంబ్లీలో బీఆర్ఎస్ మంత్రే ఒప్పుకున్నాడు. ఈ ప్రాజెక్టుకు ఖర్చు చేసిన రూ. 1.20లక్షల కోట్లలో దాదాపు రూ. లక్ష కోట్లు కేంద్ర సంస్థలే రుణాలు ఇచ్చాయి. పవర్ కార్పొరేషన్ రూ. 38వేల కోట్లు, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ రూ. 30వేల కోట్లు, పీఎన్ బీ రూ. 11వేల కోట్లు, నాబార్డ్, ఇతర సంస్థలు కలిపి రూ. 20వేల కోట్ల వరకు రుణాలు ఇచ్చాయి. ఈ సొమ్మంతా దేశ ప్రజలదే.. అందుకే ఇది దేశంలోనే అతి పెద్ద స్కాం. కాళేశ్వరం విఫలమైన ప్రాజెక్టు.. రూ. 1.20లక్షల కోట్లు ఖర్చు చేస్తే మూడేండ్లకే మునిగిపోయింది. దేశంలోని ప్రతి పౌరుడికి కాళేశ్వరం అవినీతిని తెలియజేయాలన్నదే మా ముఖ్య ఉద్దేశమని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో నిబంధనలన్నీ గాలికి వదిలేశారు. కాళేశ్వరం

(మిగతా 2లో)

# దళిత,బహుజన విప్లవ నాయకుడు కాన్షిరాం

**నేడు ఆయన జయంతి**



దేశ రాజకియాలలో పెను మార్పులు తెచ్చి బహుజనులకు రాజ్యాధికారం కల్పించి భారత దేశ రాజకీయ చిత్ర పటాన్ని మార్చిన ఘనత కాన్షి రాం కు దక్కుతుంది. కాన్షి రాం చనిపోయి దశాబ్దం గడిచినది కాని బహుజన నాయుకుడిగా దేశ రాజకీయాలపై అతను ప్రసరించిన ప్రభావంను అతని అనుచరులు, సమర్ధకులు చివరికి అతని వ్యతిరేకులు కూడా విస్మరించ జాలరు. కాన్షి రాం ఉత్తర భారత దేశం లో బహుజనులు-దళితుల, వెనుక బడిన, అణగారిన వర్గాల తిరుగు లేని నాయకుడు. అతడు తన జీవితాంతం పై వర్గాల రాజకీయ అధికార ప్రాప్తి కోసం రాజి లేని పోరాటం సాగించినాడు. చిన్న తనం నుండి సమాజ మార్పు కోసం, రాజకీయాలలో అధికార మార్పు కోసం కంకణం దాల్చినాడు. సైకిల్ పై విస్తృతం గా దేశ వ్యాప్తం గా పర్యటించి బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయం ను ప్రచారం చేసి దళితులకు రాజకియ అదికారం కోసం పాటు పడ్డాడు. కాన్షి రామ్ మొదట్లో డీఎస్4, బీఏయంసిఈఎఫ్ తరువాత బహుజన సమాజ పార్టి ని స్థాపించినాడు. ఆ తరువాత మాయావతి దానికి నాయకత్వం వహించి ఉత్తర ప్రదేశ్ కుల రాజకీయాలను కూకటి వేళ్ళతో ధ్వంసం చేసి ముఖ్య మంత్రి అయినది. పంజాబ్ లో జన్మించిన శ్రీ కాన్షి రాం ఉత్తర ప్రదేశ్ ను తన రాజకీయ కేంద్రం గా నిర్ణయినీచుకొన్నారు. ఇతర దళిత నాయకుల వలే కాంగ్రెస్ మరి ఎ ఇతర రాజకీయ పక్షానికి దాసోహం అనలేదు. సంపద, వివాహం, ఇంటిని విడిచి ఫులే-అంబేద్కర్ ఆశయాల సాధన కొరకు తన జీవితం ను అంకితం చేసిన ధీశాలి శ్రీ కాన్షి రాం . దళితులకు శతాబ్దాల వారిగా జరుగుతున్న అన్యాయం, అసమానతల పట్ల కాన్షిరాం తన అసంతృప్తిని, బాధ ను ఆక్రోశం వేల్లుబుచ్చారు. తిలక్,తరాజు ఔర్ తల్వార్ కో మారో అనే నినాదం అగ్రవర్ణాల వారిని కోపానికి గురిచేసింది. కాని కాన్షి రామ్ తన ప్రచారం చేత బహుజన సమాజ్ పార్టి ని దేశ ప్రధాన రాజకీయ పక్షం గా నిలబెట్టారు. మొదట్లో సమాజ్ వాది పార్టి తో పిదప కాంగ్రెస్ తో జత కట్టి బ.స.పా ఉత్తర ప్రదేశ్ లో దళితుల పాలిటి అతి ముఖ్యమైన రాజకీయ పార్టి గా అవతరించినది. ముస్లిం ల సమర్ధన కుడా పొందినది. కుల రాజకీయాలు ఎక్కువగా ఉన్న సామజిక అసమానతలు అధికం గా గల ఉత్తర ప్రదేశ్ లో బ.స.పా. అధికారం లోకి రావడం తో దళితులకు రాజకీయ అధికారం లబించినది. అతని శిష్యురాలు బహెన్ మాయావతి యు.పి. లో రెండు సార్లు ముఖ్య మంత్రి పదవిని పొందినారు.బహుజన సమాజ్ పార్టీ నిర్మాత. రామదాసియా శిక్కు చమార్ కులస్తులైన తేల్సింగ్, బిషన్సింగ్ కౌర్ లకు .మార్చి 15, 1934 పంజాబ్ రాష్ట్రంలో రోపార్ జిల్లా కావాస్పూర్ గ్రామంలోజన్మించాడు. జ్యోతిరావుఫూలే, ఛత్రపతి సాహు మహరాజ్, పెరియార్ ఇ.వి. రామస్వామి నాయకర్, నారాయణగురు, అంబేద్కర్ ల ప్రబోధాలను రాజ్యాధికారం వైపు నడిపి విజయాలు సాధించాడు. తన 31వ ఏటనే అంబేద్కర్ రచించిన 'కుల నిర్మూలన ' గ్రంథం ద్వారా ప్రేరేపితుడయ్యాడు. తన తల్లికి ముప్పై పేజీల ఉత్తరం రాస్తూ 'ఇక నుంచి నేను కుటుంబ బాంధవ్యాలను తెంచుకుంటున్నాను. నా కోసం మీరు వెతకవద్దు' అంటూ బయటికి వెళ్లి, చనిపోయే వరకు తిరిగి ఇంటికి వెళ్లలేదు. 1984 ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించాడు. ఒక ఓటు-ఒక నోటు అనే నినాదంతో ప్రజల దగ్గరకు వెళ్లి వారిచ్చే డబ్బుతోనే ప్రచారం చేశాడు. కులాన్ని నిర్మూలిద్దాం-బహుజన సమాజాన్ని నిర్మిద్దాం అంటూ దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టాడు. నువ్వు 85 శాతం ఉండగా 15 శాతం మీద ఎందుకు ఆధారపడతావు? నడువు పార్లమెంటు, అసెంబ్లీకి నడువు. నీ కాళ్లమీద నీవే నడువు అంటూ బహుజనులను ఉసిగొల్పాడు. ప్రభుత్వ భూమి అంటే ప్రజల భూమి. ప్రజల భూమి మీద ప్రజలకు హక్కులేదా? అనేవాడు. కులాన్ని కులంతోనే జయించాలని కులాన్ని రాజకీయ ఆయుధంగా వాడుకున్నాడు. యూపిలోని చమార్లనే పునాదిగా చేసుకొని పంజాబ్, హర్యానా, ఢిల్లీ, కాశ్మీర్, బీహార్, మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ లలో ఇతర కులాలను కలుపుకొని పార్టీని బలోపేతం చేశాడు. మాయావతిని ముఖ్యమంత్రిగా చేశాడు. 1984లో ప్రారంభమైన బిఎస్పి 1996 నాటికి జాతీయ పార్టీగా ఎదిగింది. 2006 అక్టోబరు 9న కాన్షీరాం మరణించాడు. భారత దేశ దళిత చరిత్ర లో కాన్షి రామ్ బహుజనులకు రాజ్యాధికార సాధన లో సాధించిన విజయం మరుపు రానిది.

## నాలుగేళ్లుగా సుపరిపాలన అందిస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

ఆకాంక్షల కోసం సీఎం పాలన సాగుతోందన్నారు. సమీకృత అభివృద్ధి కోసం పారదర్శక పాలన అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తోందన్నారు. నవరత్నాలు, అభివృద్ధి సంక్షేమ పథకాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అవినీతికి తావులేకుండా అర్హులం దరికీ నేరుగా లబ్ధి చేకూరుతోందని చెప్పారు. 45 నెలల్లో 1.97 లక్షల కోట్ల నగదు ప్రజలకి చేరిందన్నారు. నాలుగేళ్లుగా సుపరిపాలన అందిస్తున్నా మన్నారు. వినూత్నంగా వాలంటీర్ వ్యవస్థ అమలు చేస్తున్నా మని గవర్నర్ తెలిపారు. నవరత్నాలతో సంక్షేమం, పారదర్శక పాలన ఐదు కోట్ల మంది ఆకాంక్షలతో ఏర్పడిన ప్రభుత్వం ఆ దిశగానే నాలుగేళ్లుగా అనేక అద్భుతాలు సాధించిందన్నారు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్. ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాల ప్రారంభమైన సందర్భంగా ఆయన ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. తన స్పీచ్లో నాలుగేళ్లుగా ప్రభుత్వం సాదించిన ఫలితాలను సభకు వివరించారు. ఆంధ్రప్రదేశ్లో నవరత్నాలతో సంక్షేమ పాలన నడుస్తోందని గవర్నర్ తెలిపారు. సంక్షేమంతోపాటు అభివృద్ధి పథంలో కూడా రాష్ట్రం దూసుకెళ్తోందని పేర్కొన్నారు. 45 నెలల్లో 1.97 లక్షల కోట్ల సొమ్ము నేరుగా ప్రజలకు చేరిందని వివరించారు. 4 ఏళ్లలో 5 కోట్ల మంది ప్రజల ఆకాంక్షల కోసం పారదర్శక పాలన అందిస్తున్నామన్నారు. సమీకృత అభివృద్ధి కోసం పారదర్శక పాలన ఇవ్వగలుగుతున్నామని వివరించారు. నవరత్నాల అమలుతోపాటు ఎలాంటి అవినీతి తావులేకుండా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందజేస్తున్నట్టు వివరించారు గవర్నర్. డీబీటీ ద్వారా అవినీతికి తావు లేకుండా లబ్ధిదారులకే సొమ్ములు ఇవ్వడం ఇదో కొత్త ఒరవడిగా అభివర్ణిం చారు. గ్రామవార్డు సచివాలయాలతో ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లామన్నారు. లబ్ధిదారుల గుర్తింపు కోసం వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చామని తెలిపారు. సంక్షేమంతోపాటు వృద్ధిలోనూ ఏ మాత్రం తగ్గేదే లేదన్నారు గవర్నర్. వ్యవసాయం, పారిశ్రామిక, సేవాల రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధించినట్టు వివరాలు సభకు అందజేశారు. 2020-21 జీఎస్డీపీ వృద్ధిరేటులో ఏపీ నెంబర వన్గా నిలిచిందన్నారు. ఆర్థికాభివృద్ధిలో ఏపీ ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అందుకు తగ్గట్టుగానే మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. నాడు నేడుతో స్కూల్ ఆధునీకరిం చడంతోపాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందిం చేందుకు మధ్యాహ్న భోజన పథకంలో మార్పులు చేసినట్టు సభ దృష్టికి తీసుకొచ్చారు. నాడు నేడు కార్యక్రమంలో భాగంగా మొదటి ఫేజ్లో 3669కోట్లతో 15717 స్కూళ్లు ఆధునీకరిస్తే... రెండో ఫేజ్లో 8345 కోట్లతో 22345 స్కూళ్లను ఆధునీకరిస్తున్నట్టు వివరించారు. 9900 కోట్లతో 44 లక్షల మంది తల్లులకు 15వేలు చొప్పున అమ్మఒడి అందిస్తున్నామని తెలిపారు.

**గవర్నర్ ప్రసంగంలో మరికొన్ని హైలెట్స్**

రాష్ట్రంలో ప్రతి మండలంలో రెండు జూనియర్ కాలేజీలు ఉండేలా ప్లాన్ చేస్తున్నామని వివరించారు గవర్నర్. కొత్తగా 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేశామని చెప్పారు. కూరుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేశామన్నారు. కడపలో ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ప్రోత్సాహకర ధోరణిలో ఉందన్నారు గవర్నర్. 2022-23 ముందస్తు అంచనాలు ప్రస్తుత ధరల్లో 16.22 శాతం సమగ్ర వృద్ధిని సూచిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత దరల్లో ఏపీ తలసరి ఆదాయం 2021-22లో 1,92,517 నుంచి 14.02శాతం వృద్ధి రేటుతో 2,19,518లకు చేరిందన్నారు. రాష్ట్రంలోని విద్యాసంస్కరణలకు సంబంధించి డిజిటల్ లెర్నింగ్ కీలక అంశంగా ఉంది. అన్ని వర్గాల విద్యార్థులు నేటి సమాజంతో పోటీ పడేలా 690కోట్ల విలువగ 5.20 లక్షల ట్యాబ్లను పంపిణీ చేశాం. ఈ ట్యాబ్లలో బైజూస్ కంటెంట్ అప్లోడ్ చేసి ఇచ్చాం. వీటిని4.60 లక్షల మంది విద్యార్థులకు, 60వేల మంది ఉపాధ్యాయులకు ఉచితంగా అందజేశాం. ఆరో తరగతి నుంచి ఆ పై తరగతులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ప్రవేశ పెట్టాలని చూస్తున్నాం. ఈ ప్యానల్స్ను 5,800 పాఠశాలల్లోని 30,213 తరగతి గదుల్లో నెలకొల్పేందుకు ప్లాన్ చేస్తున్నాం. “

## స్మార్ట్ఫోన్ల పై కేంద్రం కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

అనువుగా చేసుకుని గూఢచర్యం వంటివాటికి పాల్పడకుండా నిరోధించాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. దేశ భద్రత దృష్ట్యా ప్రీ-ఇన్స్టాల్డ్ యాప్స్ను తొలగించే అవకాశం ఉండేలా చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం.ప్రపంచంలోని స్మార్ట్ఫోన్ల మార్కెట్లలో మన దేశం రెండో స్థానంలో ఉన్న సంగతి తెలిసిందే. షియోమీ స్మార్ట్ఫోన్తోపాటు గెట్యాప్స్ యాప్ స్టోర్ వస్తుంది. ఈ ప్రీ-ఇన్స్టాల్డ్ యాప్ను తొలగించడం సాధ్యం కాదు. శాంసంగ్ తదితర స్మార్ట్ఫోన్లలో కూడా ఇటువంటి యాప్స్ ఉంటాయి. ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే శాంసంగ్, షియోమీ, వివో, ఆపిల్ వంటి కంపెనీలు తమ కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకురావడానికి మరింత ఎక్కువ సమయం పడుతుంది. అంతేకాకుండా వీటిలోని ప్రీ-ఇన్స్టాల్డ్ యాప్స్ వల్ల వ్యాపార నష్టాలు కూడా ఉంటాయి.చైనా వ్యాపారాలపై భారత ప్రభుత్వం తనిఖీలను 2020 నుంచి పెంచింది. టిక్టాక్ సహా సుమారు 300 చైనీస్ యాప్స్ను నిషేధించింది. చైనా సంస్థలు మన దేశంలో పెడుతున్న పెట్టుబడులపై కూడా దృష్టి సారించింది. ఇటువంటి చర్యలను ఇతర దేశాలు కూడా చేపడుతున్నాయి. హువావెయి హిక్విజన్ వంటి చైనా కంపెనీల టెక్నాలజీని ఉపయోగించుకోవడంపై చాలా దేశాలు ఆంక్షలను అమలు చేస్తున్నాయి. ఈ కంపెనీల టెక్నాలజీ ద్వారా చైనా ప్రభుత్వం గూఢచర్యానికి పాల్పడుతుందనే ఆందోళన వివిధ దేశాల ప్రభుత్వాలను వేధిస్తోంది. అయితే తాము గూఢచర్యానికి పాల్పడటం లేదని చైనా చెప్తోంది.

## భోపాల్ గ్యాస్ లీక్ దుర్ఘటన లో కేంద్రానికి ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

ఐసో సైనేట్ అనే అత్యంత విషపూరిత వాయువు లీక్ అయింది. ఈ దుర్ఘటనలో అప్పటికప్పుడే 3,000 మంది మరణించగా, 1.02 లక్షల మంది విషయవాయువుల ప్రభావానికి లోనయ్యారు. ప్రపంచలోనే అతిపెద్ద పారిశ్రామిక విపత్తుగా దీనిని పరిగణిస్తుంటారు. ఈ కేసును రీఓపెన్ చేయాలని, అమెరికాకు చెందిన యూనియన్ కార్బైడ్ కార్పొరేషన్ యాజమాన్యంలోని కంపెనీల నుంచి రూ.7,844 కోట్ల అదనపు పరిహారం చెల్లించేందుకు ఆదేశించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం క్యూరేటివ్ పిటిషన్ను దాఖలు చేసింది. 1989లో సెటిల్మెంట్ సమయంలో మానవ జీవితాలకు, పర్యావరణానికి జరిగిన వాస్తవ నష్టాన్ని సరిగ్గా అంచనా వేయలేదని కేంద్రం వాదించింది. అయితే, ఈ పిటిషన్ను ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం తోసిపుచ్చుతూ, మోసపూరితంగా మాత్రమే సెటిల్మెంట్ను పక్కన పెట్టవచ్చని, కేంద్రం ఆ పాయింట్పై ఎలాంటి వాదనలు చేయలేదని పేర్కొంది. రెండు దశాబ్దాల ఈ అంశాన్ని కేంద్రం లేవనెత్తడంలో హేతుబద్ధత కూడా లేదని తెలిపింది. క్యూరేటివ్ పిటిషన్ను తోసిపుచ్చుతున్నట్టు పేర్కొంది. పెండింగ్లో ఉన్న నష్టపరిహారం క్లెయిమ్స్ కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద ఉన్న రూ.50 కోట్లు వినియోగించాలని కూడా ధర్మాసనం ఆదేశించింది. కేంద్ర వేసిన పిటిషన్పై జస్టిస్ సంజయ్ కృష్ణలాల్ సారథ్యంలోని రాజ్యాంగ ధర్మాసనం తీర్పును గత జనవరి 12న రిజర్వ్ చేసింది. ధర్మాసనంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ విక్రమ్నాథ్, జస్టిస్ జేఎం మహేశ్వర్ సభ్యులుగా ఉన్నారు.

## చలామణీలో రూ. 130 కోట్ల ఈ-రూపాయిలు

వెల్లడించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హోల్సేల్ సెగ్మెంట్ కోసం 1 నవంబర్ 2022న డిజిటల్ రూపాయిని (వ?-చి) జారీ చేసింది. ఆ తర్వాత, 1 డిసెంబర్ 2022న రిటైల్ సెగ్మెంట్ కోసం ఈ-రూపాయలను చెలామణీలోకి తీసుకొచ్చింది.ప్రస్తుతం, తొమ్మిది బ్యాంకులు డిజిటల్ రూపాయి హోల్సేల్ పైలట్ ప్రాజెక్టో పాల్గొంటున్నాయని ఆర్థిక మంత్రి చెప్పారు. అవి... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యెస్ బ్యాంక్, ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్, హెచ్ఎస్బీసీ.

=లోక్సభలో రాతపూర్వక సమాధానం రూపంలో నిర్మల సీతారామన్ వెల్లడించిన వివరాల ప్రకారం... మొత్తం డిజిటల్ రూపాయిల్లో రిలైట్ ఈ-రూపాయల వాటా చాలా తక్కువగా ఉంది. 2023 ఫిబ్రవరి 28 నాటికి, దేశంలో చలామణీలో ఉన్న రూపాయిల్లో రిటైల్ ఈ-రూపాయల (వ?-ఖీ) విలువ రూ. 4.14 కోట్లు కాగా... హోల్సేల్ ఈ-రూపాయల (వ?-చి) విలువ రూ. 126.27 కోట్లుగా ఉంది. వ?-ఖీ అనేది చట్టపరమైన టెండర్ను సూచించే డిజిటల్ టోకెన్ రూపంలో ఉంటుంది. అంటే, దీనికి చెల్లుబాటు ఉందని అర్థం. భారతదేశ రూపాయికి ఇది సమానం. ప్రస్తుతం కాగితం కరెన్సీ డ నాణేలను జారీ చేసిన డినామినేషన్లలోనే ఈ-రూపాయలు జారీ చేస్తున్నారు.అర్హత కలిగిన బ్యాంకుల ద్వారా ఈ-రూపాయల పంపిణీ జరుగుతోంది. ఈ బ్యాంకులు అందించే డిజిటల్ వాలెట్ ద్వారా వ?-ఖీ లావాదేవీలు చేయవచ్చు, మొబైల్ ఫోన్లు, వాలెట్, పరికరాల్లో నిల్వ చేసుకోవచ్చు. వినియోగదార్లు ఏ దుకాణం లేదా వ్యక్తులకు ఈ-రూపాయిల్లో చెల్లింపులు చేయవచ్చు, స్వీకరించవచ్చు. పైలెట్ ప్రాజెక్ట్ నడుస్తోంది కాబట్టి, క్లోజ్డ్ యూజర్ గ్రూప్లోని 5 ఎంపిక చేసిన ప్రదేశాల్లో మాత్రమే ప్రస్తుతం వ?-ఖీ లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లోనే పర్సన్ టు పర్సన్ పర్సన్ టు మర్చంట్ (ఖ2ఓ) లావాదేవీలకు అనుమతి ఇచ్చారు. ఈ 5 ప్రాంతాల్లోని టీ దుకాణాలు, పండ్ల దుకాణాలు, వీధి వ్యాపారాలు, చిన్న దుకాణాలు మొదలైన అన్ని చోట్లా ఈ-రూపాయిని ఉపయోగిచవచ్చు. ఇంకా, రిటైల్ చైన్లు, పెట్రోల్ పంపులు కూడా ఈ-రూపాయలను అంగీకరిస్తున్నాయి. కొంతమంది ఆన్లైన్ వ్యాపారులు కూడా వినియోగదార్ల సౌలభ్యం కోసం డిజిటల్ రూపాయిల్లో చెల్లింపులను అంగీకరిస్తున్నారు. ఈ 5 ప్రాంతాల్లోని అనుభవాల తర్వాత, ఏమైనా మార్పులు ఉంటే చేసి, దేశవ్యాప్తంగా క్రమంగా లావాదేవీలను అమలులోకి తీసుకువస్తారు.

## కాళేశ్వరం దేశంలోనే అతిపెద్ద స్కామ్

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టుకు పురుడి పోసింది మహానేత వైయస్ఆర్. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల పేరుతో ఈ ప్రాజెక్టుకు గతంలోనే శ్రీకారం చుట్టారు. రూ.38వేల కోట్లతోనే 16లక్షల ఎకరాలకు నీళ్లు అందించాలని వైయస్ఆర్ భావించారు. కేవలం గ్రావిటీ ద్వారానే ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలని భావించారు. కానీ ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఈ ప్రాజెక్టును రీడిజైనింగ్ చేశారు.. ప్రాజెక్టు వ్యయాన్ని మూడు రెట్లు పెంచి అవినీతికి పాల్పడ్డారు. ఎత్తిపోతల అవసరం లేకున్నా పెద్ద పెద్ద మోటార్లతో నీళ్లు తోడారు. రూ.1600 కోట్లతో కొనుగోలు చేసిన మోటార్లకు రూ.7వేల కోట్ల లెక్కచూపారు. రూ.38వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టుకు రూ.1.20లక్షల కోట్లు ఖర్చు చేశారు. 18లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని చెప్పి, లక్షన్నర ఎకరాలకు కూడా నీళు ఇవ్వలేదు. దీనిపై కేసీఆర్ సమాధానం చెప్పాలి.. ప్రతి ప్యాకేజీలో అవినీతి జరిగింది. కాళేశ్వరంలో మోటార్లకు అయ్యే కరెంట్ బిల్ ఖర్చే ఏడాదికి రూ.3వేల కోట్లు. రోజుకు రెండు టీఎంసీల చొప్పున నీళ్లు ఎత్తిపోస్తామని చెప్పి, అర టీఎంసీ కూడా లిఫ్ట్ చేయడం లేదు. ఒక్క ఏడాది కూడా సరిగ్గా నీళ్లు ఎత్తిపోయలేదు.. ఇది బోగస్ ప్రాజెక్టు. కాళేశ్వరం అవినీతిపై ప్రతిపక్షాలు మాట్లాడడం లేదనిఅన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కేసీఆర్ కు, మెగాకు అమ్ముడుపోయాయి.. రేవంత్ రెడ్డి, బండి సంజయ్ మెగాకు అమ్ముడుపోయారు. అందుకే ఆ పార్టీలు కాళేశ్వరం అవినీతిపై ప్రశ్నించడం లేదు. రాష్ట్రంలో కాదు.. దేశంలోనే కేసీఆర్ అవినీతిపై పోరాడుతున్న ఏకైక మా పార్టీ అని అన్నారు.

## శ్రీలంక చెర నుంచి భారతీయ జాలర్లను విడిపించాలి..

(మొదటిపేజీ తరువాయి)

కల్పించాలని, అలాంటి ఘటనలు జరగకుండా చూసేందుకు ప్రధాని మోదీ వ్యక్తిగత జోక్యం చేసుకోవాలని సీఎం ఎంకే స్టాలిన్ కోరారు. ఈమేరకు చర్యలు తీసుకోవాలని కోరుతూ విదేశాంగ మంత్రి జైశంకర్కు సీఎం ఎంకే స్టాలిన్ లేఖ రాశారు. “శ్రీలంక పౌరులచే ఈ దాడుల సంఘటనలు తరచుగా జరుగుతున్నాయని సూచించడానికి నేను బాధపడ్డాను. అందువల్ల, భారత ప్రభుత్వం తక్షణమే శ్రీలంక ప్రభుత్వానికి ఈ విషయాన్ని తెలియజేయవలసిందిగా కోరుతున్నాను. శ్రీలంక పౌరులు, భవిష్యత్తులో ఇలాంటి హింసాత్మక చర్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు వీలు కల్పిస్తుంది” అని సీఎం స్టాలిన్ అన్నారు. ఇదిలావుండగా, తమిళ మత్స్యకారులపై ఇటీవల జరిగిన దాడికి వ్యతిరేకంగా తమిళ అనుకూల గ్రూప్, మే 17 మూవ్మెంట్ కార్యకర్తలు నిరసన ప్రదర్శనలు నిర్వహించి శ్రీలంక హైకమిషన్పై ముట్టడికి ప్రయత్నించారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# ప్రజారాజ్యం బాటలోనే... జనసేనా..

**విజయవాడ**

పవన్ కళ్యాణ్ ..తెలుగు రాజకీయాల్లో ఒక బలమైన ఫోర్స్. ఆయనకున్న ఆకర్షణ.. అభిమాన జనం అసాధారణం. అయితే..పార్టీ పెట్టి పదేళ్లు గడిచినా....జనసేన ఇంకా చెప్పుకోదగ్గ స్థాయిలో బలం పుంజుకోలేదు. సీట్లు గెలవలేదు. కారణం పార్టీ విధానాలూ.. పోకడల్లో నెలకొన్న సమన్వయం లోపాలే తప్ప జనం కాదన్నది విశ్లేషకుల అభిప్రాయం. ఈ విషయాన్ని అధినేత పవన్ కల్యాణ్ గ్రహించలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ మధ్య పవన్ కల్యాణ్ పదే పదే వాడుతున్న మాట “ ఎంతో ఆదాయం ఇచ్చే సినిమాలను వదులుకుని మీ కోసం వచ్చాను” అని కొన్నాళ్ళ క్రితం వరకూ సినిమాకు 50కోట్ల ఆదాయాన్ని వదులుకుని రాజకీయాల్లోకి వచ్చాను అని అనే పవన్ తాజాగా రోజుకు రెండు కోట్ల ఆదాయం తాను సినిమాల్లో నటిస్తే వస్తుంది అని అన్నారు. కానీ ఇలాంటి మాటలు ఆయనపై సామాన్య జనంలో సానుభూతిని రప్పించే అవకాశం ఉండదని తెలుసుకోవడం లేదు. ఇప్పటి ట్రెండ్ ప్రకారం అయితే ఎవరు అంత ఆదాయం వదులుకుని రమ్మన్నారు అని కౌంటర్ లు పడతాయి తప్ప పవన్ ఆశయాలను గుర్తించరు. పవన్ కళ్యాణ్ అంత ఆదాయన్నిచ్చే సినిమా రంగాన్ని వదిలి మాకోసం రాజకీయాల్లోకి వచ్చాడనే ఫీలింగ్ జనం నుంచి స్వతహాగా రావాలి తప్ప .. ఆ మాట పవన్ స్వయంగా పదే పదే చెప్పడం వల్ల మంచి ఇంప్రెషన్ అయితే కలిగే అవకాశాలు లేవన్నది విశ్లేషకుల అభిప్రాయం.ప్రజారాజ్యం సమయంలో మెగాస్టార్ చిరంజీవి కూడా ఇంతే. “ మీరు రాజకీయాల్లోకి రమ్మన్నారు..నేను వచ్చేసాను” అంటూ జనం పైనే తనను గెలిపించే భారం అన్నట్టు మాట్లాడేవారు. ఇది పెద్ద బూమెరాంగ్ అయింది ఆ రోజుల్లో. ఎవరైనా సరే రాజకీయాల్లోకి వచ్చేది పదవుల కోసం అనేది సుస్పష్టం. ప్రజలకు సేవ చేయాలనే ఆశయం ఎంతో కొంత ఉండొచ్చు.. కానీ అంతిమ లక్ష్యం అధికారమే. ఈ మోడ్రన్ పాలిటిక్స్ యుగంలో చిన్న పిల్లాడికి సైతం తెలిసిన సత్యం ఇది. కాబట్టి ఈ రకమైన మాటలు పవన్ కచ్చితంగా మార్చుకోవాల్సిందే. కేటీఆర్ అమెరికాలో ఉద్యోగం చేసుకునే సమయంలో రాజకీయాల్లో రావాలని తెలంగాణ మూమెంట్‌ను వేదికగా చేసుకుని ఎంట్రీ ఇచ్చారు. అంత ఉద్యమం జరుగుతున్న సమయంలో కూడా జనం తనను రావాలని కోరారు..అందుకే అమెరికాలో ఉద్యోగం వదిలి వచ్చేశా లాంటి మాటలు ఆయన ఎప్పుడూ మాట్లాడలేదు. జగన్ కూడా “ఓదార్పు యాత్ర చేస్తా..ముఖ్యమంత్రి అవుతా.. రాజన్న బిడ్డను ఆశీర్వదించండి “ అన్నారు గానీ మీ కోసం బిజినెస్‌లు వదిలేసి వచ్చేశా లాంటి మాటలు మాట్లాడలేదు. వాళ్ళ లక్ష్యం ఏంటో ప్రజలకూ.. .వాళ్లకూ క్లారిటీ ఉంది. అధికారం కోసమే ఇదంతా అనే స్పష్టత ఓటర్లకు ఎప్పుడూ ఉంది. ఈ ప్రాసెస్‌లో వాళ్ల విధానాలు మాటతీరు కార్యకర్తలను కలుపుకుని పోవడంలాంటివి నచ్చి జనం వారిని అందలం ఎక్కించారు. రేపు నచ్చక పోతే దించేస్తారు అంతేగానీ, జనంతో మీ కోసమే అన్నీ వదిలేసి రాజకీయాల్లోకి వచ్చాము లాంటి డైలాగ్స్ చెప్పలేదు. చివరికి నారా లోకేష్ సైతం తమ ఓటమికి తమదే బాధ్యత అన్నారు గానీ.. జనాన్ని తప్పు బట్టే ప్రయత్నం చెయ్యలేదు. ఇప్పటికీ జగన్ ప్రభుత్వంలో అవక తవకలు జరుగుతున్నాయి. కాబట్టి నెక్స్ట్ తమకు అవకాశం ఇవ్వమని అంటున్నారే తప్ప..మీకోసం రాజకీయాల్లోకి వచ్చినా ఓడించారు లాంటి మాటలు పొరబాటున కూడా వాడట్లేదు. పవన్ మిస్ అవుతున్న పాయింట్ ఇదే.1983లో అప్పటికీ నెంబర్ వన్ హీరోగా ఉన్న ఎన్టీఆర్ రాజకీయాల్లోకి ప్రజాసేవ కోసం తనను ఇంత ఆదరించిన తెలుగు ప్రజల రుణం తీర్చుకోవడానికి వస్తున్నట్లు చెప్పారు తప్ప.. ఏ నాడూ .."మీ కోసమే సినిమాలు వదిలేసి వచ్చాను.." లాంటి మాటలు మాట్లాడలేదు. కెరీర్ లానే పాలిటిక్స్ కూడా ఒక ఇండివిద్యువల్ చాయిస్ . ఎవరికి ఇష్టం అయితే వారు వస్తారు తప్ప.."మీ కోసం అది వదిలేసా నేను సినిమాలే చేస్తే ఇంత డబ్బు సంపాదిస్తా లాంటి మాటలు" ప్రజాజీవితంలో సరికావని జనసేనాని ఎంత తొందరగా గుర్తిస్తే పార్టీకి అంత బలం అనేది విశ్లేషకుల అభిప్రాయం.

# విలీన మండలాలకు రైలు సౌకర్యం

**ఏలూరు:**

ఏజెన్సీ ప్రాంతాల్లో త్వరలో రైలు కూత వినిపించనుంది. మల్కన్‌గిరి నుంచి భద్రాచలం వరకు 173 కి.మీ. కొత్త రైల్వేలైను ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయంతో పోలవరం ముంపు మండలాల్లోని చింతూరు, కూనవరం, ఎటపాక మండలాల్లో నాలుగు రైల్వే స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు ఇప్పటికే సర్వే పూర్తి అయినట్లు రైల్వే వర్గాలు ప్రకటించాయి.ఏజెన్సీ ప్రాంతంలో త్వరలో రైలు కూతలు వినిపించబోతున్నాయి. ఇప్పటివరకు రోడ్డు మార్గంలో బస్సులు, ఇతర వాహనాలు, గోదావరిలో లాంచీలలో మాత్రమే తిరిగిన ఏజెన్సీలో ఇకపై రైళ్లు కూడా రాకపోకలు సాగించనున్నాయి. ప్రస్తుతం గిరిజన ఆవాస ప్రాంతాల ప్రజలు రైలులో ప్రయాణించాలంటే రాజమహేంద్రవరం, ఖమ్మం, కొత్తగూడెం వెళ్లాల్సి ఉంది. నూతన లైను ఏర్పాటులో భాగంగా మన్యం ఏరియాలో నాలుగు రైల్వే స్టేషన్లు నిర్మించనున్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు రైలు మార్గాన్ని అనుసంధానం చేస్తూ రవాణాను సులభతరం చేసేందుకు ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి భద్రాచలం వరకు సుమారు 173 కిలో మీటర్ల మేర రైల్వేలైను మంజూరైంది. కొత్త రైలు మార్గం నిర్మాణానికి రూ 2,800 కోట్లు అవసరమని అంచనా వేస్తున్నారు. ఈ లైన్‌ను మల్కన్‌గిరి నుంచి భద్రాచలం సమీపంలోని పాండురంగాపురం రైల్వేస్టేషన్ వరకు నిర్మిస్తారు. కొత్త రైల్వే లైను ఏర్పాటులో భాగంగా పలుచోట్ల 213 వంతెనలు నిర్మించనున్నారు. వీటిలో 48 పెద్ద వంతెనలు, 165 చిన్న వంతెనలు ఉన్నాయి. వాగులు, వంకలు, గోదావరి ఉపనదులు, పంట కాల్వల మీదుగా రైల్వే లైను నిర్మాణం జరుగనుంది.మల్కన్‌గిరి నుంచి భద్రాచలం వరకు నిర్మించనున్న కొత్త రైల్వేలైను విలీన మండలాలైన చింతూరు, కూనవరం, ఎటపాక మండలాల మీదుగా సాగనుంది. ఒడిశాలోని మల్కన్‌గిరి, కోవాసిగూడ, బదలి, రాజన్‌గూడ, మహరాజ్‌పల్లి, లూనిమన్‌గూడ, ఆంధ్రా ప్రదేశ్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం కన్నాపురం, కూనవరం మండలం కూటూరు గట్టు, పల్లూరు, ఎటపాక మండలం నందిగామలో రైల్వే స్టేషన్లు ఏర్పాటుచేస్తారు.

నందిగామ నుంచి తెలంగాణలోని గోదావరి మీదుగా భద్రాచలం, అక్కడి నుంచి పాండురంగాపురం వరకు ఈ రైల్వేలైను నిర్మించనున్నారు. రైల్వే లైన్ సర్వే పూర్తి కావడంతో వీలైనంత త్వరగా కొత్త రైలు మార్గాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రైల్వే వర్గాలు ప్రయత్నిస్తున్నాయి. బొగ్గుతో పాటు, ఖనిజ పదార్థాల రవాణాకు కొత్త రైలు మార్గం అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ రైలు మార్గం నిర్మాణానికి ఐదు నుంచి పదేళ్ల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు.

# కాటన్ సంచిలకు కేరాఫ్ అడ్రస్

**తిరుపతి:**



అది ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా పాలగుట్టపల్లె! పాకాల పక్కన ఉండే చిన్నగ్రామం. కాస్త చీకటి పడితే బస్సు ఉండదు.! ఆటోలు అంతకన్నా తిరగవు. తీవ్రమైన కరువు. 2010 నుంచి ఐదేళ్లు వాన చినుకు పడలేదు. ఎటుచూసినా ఎండిన బీళ్లు. వ్యవసాయం అడుగంటి పోయింది. తిప్పికొడితే 70 కుటుంబాలు ఉంటాయేమో. అందరూ వ్యవసాయ కూలీలే. కొద్దోగొప్పో పాడి, కోళ్లు. అలాంటి ఒక గ్రామం ఇవాళ కాటన్ బ్యాగులకు కేరాఫ్ గా నిలిచిందీ అంటే.. ఆ సక్సెస్‌కి కారణం అపర్ణ అనే సామాజిక కార్యకర్త! పాలగుట్టపల్లె బ్యాగులంటే ఇవాళ ఒక బ్రాండ్.చెన్నైకి చెందిన అపర్ణాకృష్ణన్ దాదాపు 30 ఏళ్లక్రితం పాలగుట్టపల్లెలో కొంత భూమి కొని, సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారు. వర్షాలు లేని 2010-15 మధ్య కాలం ఆమెని కలవరపెట్టింది. తన సంగతి పక్కన పెడితే, వ్యవసాయం మీదనే ఆధారపడి, కూలీనాలి చేసుకునే పల్లె ప్రజల పరిస్థితి ఏంటని ఆవేదన చెందారు. సామాజిక బాధ్యత కలిగిన అపర్ణ వాళ్లను ఏదో రకంగా ఆదుకోవాలని అనుకున్నారు. ఊరిలో కొంతమంది మహిళలకు కుట్టుమిషన్ ఉంది. జాకెట్లు, చిన్నచిన్న దుస్తులు కుట్టేవారు. వాళ్లని చేరదీస్తే మిగతా మహిళలకు కూడా ఉపాధి దొరుకుతుందని అపర్ణ భావించారు. అలా వారిని కాటన్ సంచుల తయారీకి సిద్ధం చేశారామె.అపర్ణా కృష్ణన్ తన చేతుల మీదుగా కొంత డబ్బు అడ్వాన్స్‌గా ఇస్తే, వాటితో కాటన్ బట్ట కొనుక్కొచ్చి వంద బ్యాగుల వరకు కుట్టిచ్చారు. అలా మొదలైంది వీరి ప్రయాణం. జూట్ బ్యాగులు కళావిహీనంగానే కనిపిస్తాయి. అలా అయితే వేరే బ్యాగులకు ఈ పల్లె బ్యాగులకు తేడా ఏముంటుంది.

అందుకని అపర్ణ వీరికో ఐడియా ఇచ్చింది. పాలగుట్టపల్లె బ్యాగులకు ప్రత్యేకత రావాలంటే సంచుల మీద అందమైన ప్రింట్లు, ఎంబ్రాయిడరీ వగైరా వుండాలి. అలా అయితే కస్టమర్లను ఇట్టే ఆకట్టుకోవచ్చు. అపర్ణ సూచనతో నలుగురైదుగురు ఎంబ్రాయిడరీ వర్క్ నేర్చుకున్నారు. నెమలి, వినాయకుడి బొమ్మలతో పాటు, ఆర్డర్లు ఇచ్చే కంపెనీల లోగోలు, ప్రింట్లు వేసి, కుట్టి పంపుతుంటారు. ఆ ఐడియాతో బ్యాగులకు ఇంకా మంచి పేరు వచ్చింది. ఆ మధ్య యూపీలో జరిగిన ఆర్గానిక్ కాంగ్రెస్ సదస్సుకి ఆరువేలకు పైగా సంచులు కుట్టి పంపించారు. ఆ తర్వాత కంపార్టుమెంటులుగా ఉండే కూరగాయల సంచులు తయారుచేశారు. వాటికైతే బాగా డిమాండ్ వచ్చింది. ఇక ఆర్గానిక్ ప్రాడక్ట్స్ అమ్మే షాపుల నుంచి ఆర్డర్లు కుప్పలు తెప్పలుగా వస్తుంటాయి.కాటన్ బ్యాగులు కుడతారు సరే! ఆర్డర్లు ఎలా? వాటికి మార్కెటింగ్ ఎలా? ప్రచారం ఎలా? పెట్టుబడి ఎక్కడినుంచి వస్తుంది! వీటన్నిటినీ అపర్ణే దగ్గరుండి చూసుకున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాను నమ్ముకున్నారు. అందులోనూ ప్రధానంగా వాట్సప్. ఆ తర్వాత వెబ్ సైట్. మెటీరియల్‌ను సేకరించడం మొదలుకుని ప్రోటోటైప్‌లను తయారు చేయడం, డెలివరీ గడువులను నిర్ధారించడం, క్వాలిటీ కంట్రోల్ ఇలా పూర్తిగా ఈ పల్లె మహిళలే నిర్వహిస్తారు. వీళ్లకి అక్షరం ముక్కరాదు. అయినా వ్యాపారమంతా వాట్సప్, వెబ్ సైట్ ద్వారానే చేస్తుంటారు. అంటే ఈ లెక్కన ఊరిలో మహిళలంతా డిజిటల్ అక్షరాస్యులే అన్నమాట. వచ్చిన డబ్బుతోనే ఇప్పటివరకు రొటేషన్ చేసుకుంటూ వచ్చారు. కాటన్ బట్ట, పెయింటింగ్ వగైరా మధురై నుంచి వస్తుంది.ఇప్పటి వరకు 50వేల బ్యాగ్‌లను అమ్మారంటే అతిశయోక్తి కాదు. జూ, జఖ, కెనడా వంటి దేశాలలో కూడా వీళ్లకు కస్టమర్లు ఉన్నారు. ఊరగాయలను కూడా తయారు చేస్తుంటారు. కరోనా కారణంగా వ్యాపారం దెబ్బతిన్నా మళ్లీ పుంజుకున్నారు. కష్ట సమయంలో ఈ ఊరి మహిళల స్వయం సమృద్ధి తోడుగా నిలిచిన అపర్ణా కృష్ణన్ కృషి ఎంతైనా అభినందనీయం

# నాదెండ్ల కొందరి వాడేనా

**గుంటూరు:**

అవును.. జనసేన క్యాడర్ లో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌పై వ్యతిరేకత వ్యక్తమవుతుంది. సోషల్ మీడియాలో జనసేన కార్యకర్తలే తరచూ పోస్టులు చేస్తున్నారు. నాదెండ్లకు అంతా అప్పగించి సినిమాలు చేసుకుంటే ఎలా అన్నా అంటూ పవన్ ను ప్రాధేయపడుతూ పోస్టులు కనిపిస్తున్నాయి. పవన్ కల్యాణ్ జనసేన పార్టీ అధినేత అయినా పార్టీ వ్యవహారాలన్నీ నాదెండ్ల మనోహర్ మాత్రమే చూసుకుటున్నారు. జిల్లాల పర్యటనల దగ్గర నుంచి ముఖ్యమైన నేతలతో భేటీల వరకూ ఆయనే చూసుకుంటున్నారు. ఇది జనసేన పార్టీలోని ఎక్కువ మందికి రుచించడం లేదు. పైగా నాదెండ్ల మనోహర్ దగ్గరుండి తెలుగుదేశం పార్టీతో పొత్తు కుదరడానికి ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు కూడా ఆ పార్టీ నుంచే వినపడుతున్నాయి. నిజానికి నాదెండ్ల మనోహర్ మృదుస్వభావి. రాజకీయాలను రఫ్ గా చేయలేరన్న పేరుంది. ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు కూడా పెద్దగా వివాదంలో కనపడే వారు కాదు. తన తండ్రి నాదెండ్ల భాస్కరరావు రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారే కాని, ఆయన ముద్ర, నీడ తన మీద పడకుండా తొలి నుంచి జాగ్రత్తలు తీసుకున్నారు. అందుకే మనోహర్ కు సౌమ్యుడిగా పేరుంది. నిజానికి ఆయన జనసేనలోకి వెళతారని ఎవరూ భావించలేదు. రాష్ట్ర విభజన జరిగిన వెంటనే నాదెండ్ల మనోహర్ తెలుగుదేశం లేదా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వెళతారని అందరూ అనుకున్నారు. ఆయన అందరి అంచనాలకు భిన్నంగా ఆయన జనసేన పార్టీలో చేరారు. పవన్ కల్యాణ్‌కు అత్యంత సన్నిహితుడిగా మారారు. పార్టీలో నెంబరు 2 నాదెండ్ల మాత్రమేనని చెప్పాలి. నాదెండ్ల చెబితేనే పవన్ వింటారన్న అభిప్రాయం కూడా పార్టీలో వ్యక్తమవుతుంది. అయితే అనేక మంది జనసేన నుంచి వెళ్లిపోవడానికి కూడా నాదెండ్ల మనోహర్ కారణమనే వారు లేకపోలేదు. తొలినాళ్లలో ఉన్న వాళ్లంతా పార్టీని వీడారు. అయినా నాదెండ్ల మాత్రం పవన్ వెంటే ఉన్నారు. పవన్ కూడా అంతా నమ్మి సర్వం నాదెండ్ల చేతిలో పెట్టారంటారు. ఆ సినిమాకు 7 ఆస్కార్ లు కొందరి వైపే... కన్నా లక్ష్మీనారాయణ, హరిరామ జోగయ్యలతో భేటీ బాధ్యతను కూడా నాదెండ్ల మనోహర్ కే అప్పగించారు. దీంతో ఆయన జిల్లాల పర్యటనలో కొందరిని మాత్రమే ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఏ పార్టీలోనైనా పదవుల కోసం, టిక్కెట్లు కోసం పలువురు పోటీ పడుతుంటారు. వారు పవన్ సభలకు, సమావేశాలకు హాజరవుతున్నా తమ ప్రాంతంలో ఎవరికి వారే కార్యక్రమాలు చేసుకుంటారు. జనసేనలో కూడా ఇది కొత్తేమీ కాదు. కానీ నాదెండ్ల ఒకవర్గం వైపే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకే జనసేన పార్టీ కార్యకర్తల నుంచే నాదెండ్ల మనోహర్ వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు.

# వివాదస్పదంగా ఎమ్మెల్యే జాజుల సురేందర్ ప్రవర్తన

**నిజామాబాద్:**

ఇటీవల ఓ ఆసుపత్రిలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజుల సురేందర్ ప్రవర్తన వివాదస్పదంగా మారింది. సమస్యలను సద్దుమణిగేలా చేయాల్సిన ఎమ్మెల్యే ఆసుపత్రి సిబ్బంది చెంప చెల్లుమనిపించారు. సర్దిచెప్పడానికి ప్రయత్నించిన పోలీసు అధికారిని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజుల సురేందర్ ఆస్పత్రి సిబ్బంది పై చేయి చేసుకున్న ఘటన నిజామాబాద్ నగరంలోని ఖలీల్ వాడిలోని ఎం.ఆర్. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో చోటుచేసుకుంది. అర్ధరాత్రి ఆసుపత్రికి వచ్చిన ఎమ్మెల్యే ఆగ్రహంతో ఊగిపోయిన సీసీ కెమెరా వీడియో ఫుటేజీలు వైరల్ అయ్యాయి. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గాంధారి మండలం సీతాయిపల్లికి చెందిన జ్యోతి అనే పేషెంట్ ను పరామర్శించేందుకు ఆసుపత్రికి వచ్చిన ఎమ్మెల్యే ఆమె ఆరోగ్య పరిస్థితి చూసి మండిపడ్డాడు. మహిళా రోగి విషయంలో ఆసుపత్రి సిబ్బంది తీరుపై ఆగ్రహించిన ఎమ్మెల్యే జాజుల సురేందర్ చేయి చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. ఓ మహిళా రోగి విషయంలో ప్రైవేట్ ఆసుపత్రి సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే జాజుల సురేందర్ చేయి చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. ఈ విషయంపై ఎలాంటి కేసు నమోదు కాలేదు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం సీతాయిపల్లికి చెందిన జ్యోతి ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఆమె నిజామాబాద్ ఖలీల్‌వాడిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో జాయిన్ అయ్యారు. ఆమెకు చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. హోలీ రోజున రాత్రి 10 గంటల సమయంలో ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. ఐసీయూలో ఉన్న జ్యోతి అపస్మారక స్థితికి వెళ్లినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు వైద్యుల చికిత్స తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని రోజులు ఆరోగ్యం బాగానే ఉందని చెప్పిన వైద్యులు సడన్ గా క్షీణించిందని చెబుతున్నారని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు నచ్చిన ఆసుపత్రికి తీసుకువెళ్లండని వైద్యులు చెప్పడంతో బాధిత కుటుంబం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్‌కు ఫోన్‌చేసి విషయం తెలిపారు. పార్టీ కార్యకర్త భార్య జ్యోతి పరిస్థితిపై ఎమ్మెల్యే అప్పటికే వైద్యులతో మాట్లాడారు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారని బాధితులు ఎమ్మెల్యేకు చెప్పటంతో రాత్రి 11 గంటల తర్వాత ఆసుపత్రికి వచ్చిన ఆయన.. జ్యోతికి అందిస్తున్న చికిత్సపై ఆరా తీశారు. ఈ సమయంలో అక్కడున్న ఓ వ్యక్తి తనను నర్సింగ్ ఇన్‌ఛార్జ్ గా పరిచయం చేసుకున్నాడు. వైద్యుడిని పిలిపించమని ఎమ్మెల్యే చెప్పగా ఆ సమయంలో అతడు స్పందించిన తీరుపై ఆగ్రహించిన ఎమ్మెల్యే అతడిపై చేయి చేసుకున్నారు. ఎమ్మెల్యే అనుచరులు కూడా అతడిపై దాడి చేశారు. కాసేపటి తర్వాత వైద్యులు వచ్చి రోగిని డిశ్చార్చ్ చేశారు. ఆమెను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఖలీల్ వాడి ప్రైవేటు ఆసుపత్రిలో జరిగిన ఘటనపై కేసు పెట్టవద్దని ఆసుపత్రి యజమాని, సిబ్బంది నిర్ణయించుకున్నారు. ఎమ్మెల్యే కోపంతో చేయి చేసుకున్నారని, తాము రాజీపడ్డామని తెలిపారు. అయితే ఎమ్మెల్యే చేయి చేసుకుంటున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుంది. ఈ ఘటనపై ఎమ్మెల్యే స్పందిస్తూ ... ఆసుపత్రి నిర్వాహకులు అన్యాయం చేస్తున్నారని బాధితులు ఫోన్ చేస్తే వచ్చానని చెప్తే ఆసుపత్రికి వచ్చానన్నారు. ఆ సమయంలో టీషర్ట్ ధరించి రంగులు పూసుకొని ఓ వ్యక్తి మద్యం తాగి ఉన్నాడని, అతడు ఐసీయూ ఇన్‌ఛార్జ్ అని చెప్పాడన్నారు. రోగి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగితే అతడు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని ఎమ్మెల్యే అన్నారు. ఆసుపత్రిలో గుండెకు సంబంధించిన చికిత్సకు వైద్యులు లేరని, సరైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పి నెట్టుకొచ్చారన్నా ఆరోపించారు. రోగి పరిస్థితి విషమించడంతో వేరే ఆసుపత్రికి తీసుకెళ్లమని ఒత్తిడి చేసినట్లు బాధితులు చెప్పడంతో కోపంలో చేయిచేసుకున్నట్లు తెలిపారు.

# నులిపురుగుల నివారణతో మెరుగైన ఆరోగ్యం



నులిపురుగుల నివారణతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ప్రాథమిక వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలియజేశారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం తుగ్గలి మండల హై స్కూల్,మండల ప్రజా పరిషత్ స్కూల్, కళాశాలలోనూ,ప్రైవేట్ స్కూల్స్,అంగన్వాడి సెంటర్స్ నందు 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ 400-అంజి టాబ్లెట్స్ మింగిం చడం జరిగినది.ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దామని, పిల్లలు, కిశోర బాలల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం,రక్తహీనత వల్ల నీరసంగా ఉంటారని, శారీరక, మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 7500 మంది పిల్లలకు గాను 7100 ఆల్బెండజోల్ టాబ్లెట్స్(94%) మింగడం జరిగినది. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం రోజులలో డి వార్మింగ్ చేయబడని పిల్లలకు మార్చి18 తేదీలో జరిగే మాప్-అప్ రోజులో ఆల్బెండజోల్ 400 ఎంజి మాత్రను వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ మోహన్, నాగమ్మ, ఏమ్యేల్హెచ్ లుపి మరియు సచివాలయం ఏఎన్ఎం లు,ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు, ఆశాలు తదితరులుపాల్గొన్నారు.

## బస్సు ప్రమాదంలో కండక్టర్ భర్త మృతి

**కావలి**



నెల్లూరు జిల్లా కావలి ఆర్టీసీ డిపోలో దారుణం జరిగింది. కావలి డిపో నుండి ఒంగోలు డిపోకు డైలీ సర్వీస్ బస్సు వచ్చింది. డ్రైవర్ ఏమరుపాటుతో నడపడంతో ఆర్టీసీ కండక్టర్ సుభాషినమ్మ భర్తపై బస్సు దూసుకెళ్లింది. ఘటనలో కండక్టర్ భర్త సుబ్బారాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. భార్యను బస్సు దగ్గర దిపండానికి అయన బైకు మీద వచ్చాడు. బైకు, సుబ్బారాయుడుపైకి ఒక్కసారిగా దూసుకుపోయింది. ఘటనకు కారణమయిన బస్సు డ్రైవర్ బస్సును వదిలేసి పరారైయాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారిస్తున్నారు. .

## విజయరామారావుకు మంత్రుల నివాళులు

**హైదరాబాద్**




మాజీ మంత్రి, సీబీఐ మాజీ డైరెక్టర్, విజయరామారావు మరణించారు. విషయం తెలియగానే రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మంత్రులు తలసాని శ్రీనివాస యాదవ్, చామకూర మల్లారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్యే మాగంటి గోపీ నాథ్ తదితరులు. బంజారా హిల్స్ లోని అయన వారి ఇంటికి వెళ్ళి, వారి పార్థీవ దేహం వద్ద పుష్ప గుచ్చం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు. వారితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

## చౌడమ్మ ఆలయంలో కవిత పూజలు

**నిజామాబాద్**



ఎమ్మెల్సీ కవిత నందిపేట మండలం చౌడమ్మ కొండూరు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు.. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.. కవిత దంపతులు స్వామివారికి అభిషేకము కుంకుమార్చన నిర్వహించారు. గ్రామస్తులు ఎమ్మెల్సీ కవితతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు, మేయర్ నీతు కిరణ్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

## రైస్ మిల్లు యజమానిపై ఫిర్యాదు

**నర్సాపూర్**

మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని ఒక రైస్ మిల్ యజమాని రైస్ మిల్ అసోసియేషన్ వారిపై పౌరసరఫరాల శాఖ అధికారిపై. జాయింట్ కలెక్టర్ లను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని జిల్లా కలెక్టర్. జిల్లా ఎస్పీ లకు మెదక్ జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు చేసారు. రైస్ మిల్ అసోసియేషన్ నాయకుడు చంద్రపాల్ మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణానికి చెందిన ఒక వ్యక్తి రైస్ మిల్లను లీజుకు తీసుకొని నడిపించుకుంటున్నాడన్నారు. మనకు వచ్చే దాన్యం దిగుమతి వస్తుందో దానికి కార్పొరేషన్ కు మనం ఎంత బియ్యం ఇయ్యాలో అనేది నిష్పత్తి ప్రకారం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఏ ఒక్క రైస్ మిల్లర్ కి గాని ప్రాధాన్యత ఇవ్వకూడదని అందరినీ సమానంగా చూడాలన్నారు. అలాంటివే జిల్లాలోని అందరం అన్ని రైస్ మిల్ల వారు సహకరిస్తే ఇతను మాత్రం తన సొంత పంతం నెగ్గించుకోవడానికి బీహార్ హమాలీలతో మమ్మల్ని అధికారులను చంపిస్త మనీ ఆయన వాయిస్ రికార్డులు వైరల్ చేస్తున్నాడని అన్నారు. ఇతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ వినతిపత్రం ఇచ్చామన్నారు.

## గ్యాస్ మంటల నుండి రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలి- సీపీఐ నాయకులు డిమాండ్

**నంద్యాల**

రాష్ట్ర బడ్జెట్లో ప్రజా కార్మిక కర్షక రైతులకు ఉపయోగపడే విధంగా బడ్జెట్లో నిధులు కేటాయించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు, పుదుచ్చేరి రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి నెలకు గ్యాస్ సిలిండర్ పై 300 రూపాయలు సబ్సిడీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. 2023 2024 ఆర్థిక సంవత్సరానికి 126 కోట్ల నిధులను పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్ రంగస్వామి గారు ప్రకటించి సంచలనమైన నిర్ణయం తీసుకున్నారు. అలాగే మన రాష్ట్రంలో మంగళవారం నుండి జరిగే బడ్జెట్ సమావేశంలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న వంటగ్యాస్ మంటలనుండి రాష్ట్ర ప్రభుత్వం కాపాడి వంట గ్యాస్ సిలిండర్ పై సబ్సిడీకి నిధులు కేటాయించాలని అన్నారు.

# ఫీవర్ సర్వే చేసిన వైద్యశాఖ

**నెల్లూరు:**

దగ్గు, జలుబు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడేవారిని గుర్తించి వారికి వైద్య సహాయం అందించడానికి సోమవారం నుంచి ఫీవర్ సర్వేను చేపట్టింది. ఈ మేరకు ఇప్పటికే అన్ని జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖాధికారుల (డీఎంహెచ్‌వో)కు ఉత్తర్వులు జారీ చేసింది. సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, గ్రామ, వార్డు వలంటీర్‌లు ఇంటింటికీ వెళ్లి ప్రజలను స్క్రీనింగ్ చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశించింది. శీతాకాలం ముగిసి వేసవి ప్రారంభమవుతున్న క్రమంలో వాతావరణ మార్పులతో దగ్గు, జలుబు, వైరల్ జ్వరాలు దేశవ్యాప్తంగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న సంగతి తెలిసిందే. ఇన్‌ఫ్లూయెంజా ఎ ఉపరకం హెచ్3ఎన్2 అనే వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతోందని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) ఇప్పటికే వెల్లడించింది. కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ సైతం రాష్ట్రాలకు ఇప్పటికే పలు మార్గదర్శకాలు జారీ చేసింది. హెచ్3ఎన్2 ఫ్లూ అనుమానిత లక్షణాలున్న వారికి పరీక్షలు చేయడం కోసం టెస్టింగ్ కిట్‌లను వైద్య ఆరోగ్య శాఖ కొనుగోలు చేస్తోంది. రెండు రోజుల్లో అన్ని బోధనాస్పత్రులకు వీటిని పంపనుంది. ప్రస్తుతం తిరుపతి స్విమ్స్‌లోని వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లో హెచ్3ఎన్2 నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఇక్కడ జనవరిలో 12, ఫిబ్రవరిలో తొమ్మిది పాజిటివ్ కేసులను నిర్ధారించారు. అయితే ఆందోళన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. ఏటా సీజన్ మారుతున్న సమయంలో కేసులు కొంత పెరుగుతాయని అంటున్నారు. ప్రస్తుతం వేసవి సీజన్ మొదలవుతుండటంతో అవే పరిస్థితులు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఆస్పత్రులకు వస్తున్న బాధితులకు చాలా అరుదుగా మాత్రమే అడ్మిషన్ అవసరమవుతోందని చెబుతున్నారు. సాధారణంగా ఆస్పత్రులకు వచ్చే ఓపీల్లో 5 నుంచి 6 శాతం వరకు జ్వరం, దగ్గు, జలుబు వంటి కేసులే ఉంటాయని గుర్తు చేస్తున్నారు.

**వైద్యులు సూచిస్తున్న జాగ్రత్తలు..**

క్రమం తప్పకుండా చేతులను సబ్బుతో కడుక్కోవాలి.

ఫ్లూ లక్షణాలున్నవారు మాస్క్ ధరించాలి.

వీలైనంత ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలి.

షేక్‌హ్యాండ్, ఆలింగనాలు మానుకోవాలి.

బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మకూడదు.

# తెలంగాణకు మరో 4 స్వచ్ఛతా అవార్డులు

**హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రం మరో అరుదైన ఘనత సాధించింది. స్వచ్ఛత విషయంలో ఇప్పటికే అనేక అవార్డులు, రివార్డులు సాధించిన తెలంగాణకు మరోసారి అవార్డుల పంట పండింది. దేశంలో ఓడీ ఫ్ ప్లస్ లో తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్ గా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 4 తాజా సర్వేల్లో మరోసారి తెలంగాణ పేరు కొట్టేసింది. ఓడిఎఫ్ ప్లస్ గ్రామాలు, ఇండ్ల విభాగాల్లో 100 శాతం స్వచ్ఛత కనబరిచింది. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ సర్వే లోనూ 100 శాతం స్వచ్ఛతను నమోదు చేసింది. దేశంలో అత్యధిక టాయిలెట్స్ ఉన్న 5 రాష్ట్రాల్లో మొదటి స్థానంలో తెలంగాణ నిలిచింది. సీఎం కేసీఆర్ దార్శనికత, పల్లెప్రగతి ద్వారానే ఇది సాకారమైందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. అవార్డు ప్రకటించిన కేంద్రానికి, సీఎం కేసీఆర్ కు, మంత్రులు కేటీఆర్ కు, హరీశ్ రావుకు మంత్రి ఎర్రబెల్లి కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీరాజ్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు. అవార్డులతో పాటు నిధులు కూడా ఇవ్వాలంటూ కేంద్రాన్ని కోరారు. తెలంగాణలోని దాదాపు గ్రామాలన్నీ బహిరంగ మల, మూత్రవిసర్జన రహిత విభాగంలో చేరాయి. తాజాగా మార్చి 12, 2023 నాటికి పూర్తిచేసిన కేంద్ర ప్రభుత్వ 4 సర్వేల ప్రకారం బహిరంగ మల మూత్ర విసర్జన రహిత (ఓ డి ఎఫ్ +), స్వచ్ఛ సర్వేక్షణ రెండు విభాగాల్లో రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీల్లో నూటికి నూరు శాతం స్వచ్ఛత సాధించింది తెలంగాణ! ఈ రెండు విభాగాల్లోనూ మొదటి 5 రాష్ట్రాల్లో మొదటి రాష్ట్రంగా ఉంది. ఈ విషయాన్ని స్వచ్ఛ భారత్ మిషన్ అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలోని పంచాయతీరాజ్ అధికారులు గ్రామాల్లో ఉన్న వసతులు, మౌలిక సదుపాయాల వివరాలను అప్‌డేట్ చేశారు. కేవలం మరుగుదొడ్లను నిర్మించుకుంటే ఓడీఎఫ్‌గా ప్రకటిస్తారు. ఆ తరువాతి దశ అయిన ఓడీఎఫ్ ప్లస్‌గా గుర్తింపు పొందాలంటే గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలన్నింటిలోనూ మరుగుదొడ్లు నిర్మించాలి. ప్రతీ ఇంటి నుంచి చెత్తను సేకరించాలి. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుల్లో తడి, పొడి చెత్తగా వేరు చేయాలి. ప్రతి గ్రామానికి చెత్తను సేకరించడానికి ట్రాక్టర్ సమకూర్చాలి. శ్మశాన వాటికలు, ఇంకుడు గుంతలు నిర్మించడం, రోడ్లపై నీళ్లు నిలవకుండా చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలి. రాష్ట్రంలోని దాదాపుగా అన్ని గ్రామాలు ఓడీఎఫ్ ప్లస్ పరిధిలోకి రావడం సీఎం కేసీఆర్ చేపట్టిన పల్లె ప్రగతి ద్వారానే సాధ్యమైందని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. రాష్ట్రంలోని గ్రామాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుల వల్లే, ఈ అవార్డులు దక్కాయన్నారు. అధికారులు, ఉద్యోగులు, గ్రామపంచాయతీల సిబ్బందికి, స్థానికసంస్థల ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు .గతంలోనూ స్వచ్ఛ, పారిశుధ్య, ఇ-పంచాయతీ, ఉత్తమ గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లాలు, బహిరంగ మల,మూత్ర రహిత రాష్ట్రంగా, ఉత్తమ ఆడిటింగ్ వంటి అంశాలతో పాటు 100 శాతం నల్లాల ద్వారా మంచినీటిని అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా, ఫ్లోరైడ్ రహిత రాష్ట్రంగా, అవార్డులు, రివార్డులు వచ్చాయి.

# చాపకింద నీరులా గంజాయి రవాణా

**చొప్పదండి**

నిషేదిత మాదకద్రవ్యాల సప్లై తెలంగాణలో చాపకింద నీరులా జరుగుతోంది. నిన్నటి వరకు క్వింటాళ్లు, టన్నుల్లో గంజాయిని సప్లై చేస్తూ పోలీసుల కళ్లలో పడుతుండటంతో స్మగ్లర్లు కొత్త రూట్ ఎంచుకున్నారు. స్మాల్ ప్యాక్ల రూపంలో అవసరమైన ప్రతి చోట సప్లై చేసేలా ఈ గంజాయి స్మగ్లింగ్ను ఓ చైన్ బిజినెస్లా మార్చుకున్నారు.
గంజాయి అక్రమ రవాణా ముఠాలు తమ స్టైల్ మార్చాయా..? యువతను టార్గెట్ చేస్తూ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నాయా..? దీనికోసం టీనేజి యూత్ను వినియోగిస్తున్నారా..? స్మాల్ ప్యాకర్స్, మూవర్స్, సెల్లర్స్గా అమాయక యువత బలవుతున్నారా... అంటే నిజమన్నట్టే ఇన్పుట్స్ ఉన్నాయి. వారం రోజుల క్రితం కరీంనగర్ పట్టణంలో పోలీసులు సాధారణ తనిఖీల్లో భాగంగా యువకుల వద్ద నుంచి 2కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎవరు..? ఎక్కడి నుంచి తెస్తున్నాడు.. ఎవరికోసం రవాణా చేస్తున్నాడు.. ఇవన్నీ విచారణలో తెలుసుకున్న పోలీసులు నివ్వెరపోయారు. ఇంజనీరింగ్ , మెడిసిన్ , ఇంటర్ , పదవ తరగతి విద్యార్థులు సైతం ఈ వ్యసనానికి బానిస అవుతున్నట్లు గుర్తించారు.

**తల్లిదండ్రులే కారణమా ?**

తల్లిదండ్రుల పెంపకలోపంతోనే పిల్లలు మద్యానికి ధూమపానానికి మత్తుకు బానిస అవుతున్నట్లు తెలుస్తుంది. వేలల్లో పాకెట్ మనీ ఇవ్వడం ఒక కారణం. రాత్రి వేళల్లో తరచుగా బయటికి వస్తూ బైక్ రేసింగ్ లు , ఓవర్ స్పీడ్ , యాక్సిడెంట్ చేయడం వంటివి జరుగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో మైనర్లు సైతం మత్తుకు బానిసవుతున్నట్లు సమాచారం.

**యువతే టార్గెట్**

నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలాల్లో గంజాయి సునాయాసంగా మారింది. స్థానికంగా యువతను ఫోకస్ చేస్తూ అమ్ముతున్నట్లు ప్రజలు విమర్శలు చేస్తున్నారు. యువత నిత్యం మత్తుతో ఊగిపోతున్నారు. పేరు మోసిన కాలేజీల బయట జోగుతున్నారు. రైల్వేస్టేషన్లు, హైవేలపై యదేచ్ఛగా గంజాయి దందా నడుస్తోంది. గంజాయి ఇచ్చే మత్తుతో ఎవరు ఏం చేస్తున్నారో, ఎలా ప్రవర్తిస్తున్నారో తాజాగా నమోదవుతన్న కేసులే ఉదాహరణ అవుతున్నాయి. ఫోన్ చేస్తే చాలు నేరుగా గంజాయి ప్యాకెట్ని చేతికే తీసుకొచ్చి ఇవ్వడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఇకనైనా అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

# మెదక్ జిల్లాలో వ్యక్తి కిడ్నాప్.. హత్య

**మెదక్**

మెదక్ జిల్లా శివ్వంపేట పరిధిలో ఒక వ్యక్తి కిడ్నాప్ కు గురయి తరువాత హత్యకు గురికావడం కలకలం రేపింది. స్థానికంగా వుంటున్న అంజనేయులు (50) ఈనెల 11 న పని కోసం వెల్లాడు. ఈ క్రమంలో గుర్తితెలియను వ్యక్తులు అంజనేయలును కిడ్నాప్ చేసారు. ఆదేరోజు 1అర్ధరాత్రి 2 గంటల నుంచి తెల్లవారుజామున వరకు 40 సార్లు ఆంజనేయులు ఫోన్ నుంచి కుటుంబ సభ్యులకు దుండగులు ఫోన్ చేసారు. మీ ఇంట్లో ఉన్న 7 లక్షల నగదు, మూడు తులాల బంగారం ఇవ్వాలని డిమాండ్ చేసారు. మేడ్చల్ జిల్లా షామిర్ పేట్ కి తెచ్చి ఇవ్వకపోతే మీ నాన్నని చంపేస్తామని వార్నింగ్ ఇచ్చారు. భయపడి డబ్బులు, నగదు ఇస్తాం అని మా నాన్నని ఎం చేయవద్దంటు మృతుడి భార్య, కూతుళ్లువేడుకున్నారు. కిడ్నాప్ సమాచారం తెలిసిన వెంటనే కుటుంబసభ్యులు పోలీసులకు పిర్యాదు చేసారు. అయినా పోలీసులు పట్టించుకోలేదని బాధిత కుటుంబం ఆరోపించింది. వారు మూడు జిల్లాల్లోని 4 పోలీస్ స్టేషన్లు తిరిగారు. ఫిర్యాదు చేయడానికి ఆదివారం గజ్వేల్, షామిర్ పేట్, మనోహరబాద్, శివ్వంపేట పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగారు. చివరకు శివ్వంపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ లో ఉండగానే మీరు డబ్బు, నగలు ఇచ్చేలా లేరు మీ నాన్నని చంపేస్తున్నాం ఈ సిమ్ కూడా తీసేస్తున్నాం అని కిడ్నాపర్లు ఫోన్ చేసినట్లు సమాచారం. చివరకు కిడ్నపర్లు సోమవారం రాత్రి దొంతి చెరువులో తలపై తీవ్ర గాయాలతో ఆంజనేయులు మృతదేహం లభ్యం అయింది. పోలీసులు ముందే స్పందించి ఉంటే తమ తండ్రి బతికిఉండేవాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కారు రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**పూతలపట్టు**

మంగళవారం ఉదయం పూతలపట్టు మండలం పాలకూరు జాతీయ రహదారిలో దుర్ఘటన జరిగింది.ముందు వెళుతున్న కారును ఒక లారీ ఢీకొంది. ఘటనలో కారు నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా బెంగళూర్ వాస్తవ్యులు. రు తిరుమల దర్శనం తరువాత బెంగళూరుకి తిరిగి వెళుతుండగా ఘటన జరిగింది. గాయపడ్డ వారిని హుటా హుటిన 108 లో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూతలపట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆటవీ అధికారులపై గుత్తికోయల దాడి

**మహబూబాబాద్**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ములుగు సరిహద్దు ప్రాంతంలోని జగ్గన్నగూడెం వద్ద గొత్తి కోయలను ఖాళీ చేసేందుకు ఫారెస్ట్ సిబ్బంది వెళ్లారు. అయితే గుత్తి కోయలు ఖాళీ చేయడానికి నిరాకరించారు. తరువాత ఆగ్రహంతో ఫారెస్ట్ అధికారులపై కత్తులతో దాడి చేసేందుకు ప్రయత్నం చేసారు. వెనక్కి తగ్గిన ఫారెస్ట్ అధికారులు అక్కడినుంచి వెళ్లిపోచారు. కనీసం పోలీస్ ఫోర్స్ లేకుండా సిబ్బందిని పంపడం పట్ల ఎఫ్ ఆర్ వో పై ఉద్యోగస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఫారెస్ట్ ఉద్యోగులందరూ సమావేశం కానున్నట్లు సమాచారం

## టీఎస్పీఎస్సీ కార్యాలయం ముట్టడి..అరెస్ట్

**హైదరాబాద్**

తెలంగాణ జన సమితి విద్యార్థి విభాగం మంగళవారం నాడు టీఎస్పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించింది. క్వచ్చన్ పేపర్ లీక్ కావడంలో టీఎస్పీఎస్సీ ఛైర్మెన్ జనార్ధన్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసారు. ఉద్యోగాలను అమ్ముకుంటూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని నినాదాలు చేసారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. అరెస్టు చేసి బేగంబజార్ పీఎస్ కు తరలించారు.

## కంటివెలుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి

**అశ్వారావుపేట**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం,జమ్మిగూడెం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొన్నారు. తరువాత అశ్వారావుపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉప ప్రాంతీయ రవాణా కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ప్రమాదం

**నంద్యాల**

ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని చిన్న కందుకూరు గ్రామం క్రాస్ రోడ్ వద్ద జాతీయ రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోహన్ రెడ్డి అనే వ్యక్తి మరణించాడు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ గా పని చేస్తున్న మోహన్ రెడ్డి విధి నిర్వహణ కోసం మోటార్ సైకిల్ పై వెళ్తూ,ఆర్టీసీ బస్సు కింద పడడంతో, తలకు తీవ్ర గాయమై రక్తస్రావం తో. స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అక్కడ మరణించారు. టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు..

## మంచిప్ప రిజర్వాయర్ ను పరిశీలించిన రేవంత్ రెడ్డి

**కామారెడ్డి**

కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భాగంగా మంచిప్ప రిజర్వాయర్ ప్యాకేజ్ 21,22 పనులు టపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి మంగళవారం నాడు పరిశీలించారు. రీడిజైన్ తో పది గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని ముంపు బాధితులు ఆవేదన వ్యక్తం చేసారు. 1.5 టీఎంసీ నుంచి 3.5 టీఎంసీకి పెంచడాన్ని బాధిత గ్రామాలు వ్యతిరేకిస్తున్నాయిని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా పనులు ప్రారంభించారని అన్నారు. అడ్డుకున్న వారిపై హత్యాయత్నం కేసులు పెట్టి రిమాండ్ కు తరలించారని ఆవేదన వ్యక్తం చేసారు. రీడిజైన్ ప్లాన్ రద్దు చేసి పాత ప్లాన్ ప్రకారమే పనులు చేయాలని డిమాండ్ చేసారు.

## హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం

**నంద్యాల**

నంద్యాల జిల్లా యూనిట్ లో పనిచేస్తున్న విదినిర్వహణలో మరణించిన కె. .రాజశేఖర్ హోంగార్డు నెంబర్ 324 కుటుంబానికి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా ప్రభుత్వం వారి నుండి గ్రూప్ పర్సనల్ ఆక్సిడెంట్ కింద 10,25,000/- ల చెక్కును నంద్యాల జిల్లా ఎస్పీ కె రఘువీర్ రెడ్డ చేతుల మీదుగా రాజశేఖర్ గారి భార్య కె.వెంకట లక్షమమ్మ మంగళవారం నంద్యాల జిల్లా పోలీసు కార్యలయం లో అందజేశారు.

# ముందస్తు ఊహాగానాలు...

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైఎస్సార్సీపీ గడువుకు ముందే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తుందనే అనుమానాలు ప్రతిపక్షాల్లో ఉంది. ప్రత్యర్థులు సిద్ధమయ్యేలోపు ఎన్నికలకు వెళ్లడం ద్వారా వాటి అవకాశాలకు గండి కొట్టాలనే ప్రయత్నాలు చేస్తుందనే అనుమానం పార్టీలకు ఉంది.ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు 2024లో జరగాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం 2024 సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌తో పాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగాల్సి ఉంది. అయితే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు విడివిడిగా జరగొచ్చనే అనుమానం బీజేపీ నాయకుల్లో వ్యక్తమవుతోంది. లోక్ సభ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం 2024 ఏప్రిల్-మే నెలల్లోనే జరిగినా అసెంబ్లీ ఎన్నికలకు ఆర్నెల్లు ముందుగానే జరగొచ్చని బీజేపీ నేతలు భావిస్తున్నారుఏపీలో ముందస్తు ఎన్నికలు జరుగుతాయనే ప్రచారం గతంలో కూడా జరిగింది. దేశ వ్యాప్తంగా ఒకేసారి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల్ని నిర్వహించాలనే ప్రతిపాదన జరిగినపుడు కేంద్ర ప్రతిపాదనకు ఏపీ సానుకూలంగా స్పందించిందని కథనాలు వెలువడ్డాయి. ఎన్నికల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు బీజేపీ పాలిత రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్ కూడా సానుకూలంగా స్పందించింది. అయితే బీజేపీయేతర ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు మాత్రం ఈ ప్రతిపాదనను తిరస్కరించాయి. జమిలీ ఎన్నికలకు అమోదం తెలుపలేదు. రెండేళ్లుగా ఈ ప్రతిపాదన పలుమార్లు చర్చకు వచ్చిన ఏకాభిప్రాయం కుదరకపోవడంతో జమిలీ ఎన్నికల వ్యవహారం మరుగునపడిపోయింది. అనూహ్యంగా ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న వైఎస్సార్సీపీ ముందస్తు ఎన్నికలకు వెళ్లొచ్చనే అనుమానం బీజేపీకి వచ్చింది. ఎన్నికల పొత్తులు, సర్దుబాట్ల విషయంలో ఇప్పటికీ రాజకీయ పార్టీల మధ్య క్లారిటీ రాకపోవడం, ఎన్నికలకు బాగా సమయం ఉన్నందున ప్రతిపక్ష పార్టీలు రిలాక్స్ అవుతున్నాయనే ఆలోచన వైసీపీకి ఉందని బీజేపీ నాయకులు చెబుతున్నారు.సార్వత్రిక ఎన్నికల కంటే ఆర్నెల్ల ముందే వైసీపీ ఎన్నికలకు వెళుతుందని బీజేపీ ఎంపీ ఒకరు అంచనా వేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలతో పాటే ఏపీ అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగొచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే గడపగడపకు మన ప్రభుత్వం, గృహ సారథుల నియామకం వంటి కార్యక్రమాలతో వైఎస్సార్సీపీ ఎన్నికల ప్రచారానికి సిద్ధమైపోయిందని, మరోవైపు రాజధానుల విషయంలో ఆ పార్టీ ఆలోచనల్ని ఆచరణల్ని పెట్టలేకపోవడం, కోర్టు వివాదాల నేపథ్యంలో జనంలోనే తేల్చుకునే ప్రయత్నం చేస్తుందంటున్నారు. ముందస్తు ఎన్నికలకు వెళితే ప్రతిపక్ష పార్టీలకు కూడా తగినంత సమయం లభించదని అది తమకు లాభిస్తుందనే భావన వైసీపీకి ఉందని బీజేపీ నాయకుడు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతో రాజకీయ పొత్తు ఉండదని ఇప్పటికే వైసీపీ ప్రకటించిందని, మిగిలిన పార్టీల్లో ఎవరితో ఎవరు పొత్తు పెట్టుకోవాలనే విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడాన్ని తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాలు కూడా ఉండొచ్చని అంచనా వేశారు. సాధారణ ఎన్నికలకు, అసెంబ్లీ ఎన్నికలకు మధ్య కనీసం ఆర్నెల్లు గ్యాప్ ఉండొచ్చని, ప్రభుత్వ వ్యతిరేకతకు అడ్డు కట్ట వేయడంతో పాటు ఆర్థికపరమైన కారణాలు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఉండి ఉంటాయని విశ్లేషించారు.ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో చాలా వరకు ప్రత్యక్ష నగదు బదిలీతో ముడిపడి ఉన్నవే కావడం, వాటిని అమలు చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులు కూడా ముందస్తు ఎన్నికలకు ఓ కారణమై ఉండొచ్చన్నారు. వైసీపీ వర్గాలు మాత్రం ముందస్తు ఎన్నికలు ఊహాగానాలేనని కొట్టి పారేస్తున్నాయి. అయితే జగన్మోహన్ రెడ్డి మనసులో ఏముందో ఎవరికి తెలిసే అవకాశాలు లేనందున ఎప్పుడేం జరుగుతుందో చెప్పలేమని మాత్రం చెబుతున్నారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లాలనుకుంటే కేంద్ర ప్రభుత్వ పెద్దల అమోదం కూడా అవసరమేనని చెబుతున్నారు. బీజేపీతో వైసీపీకి నేరుగా ఎలాంటి పొత్తు లేకపోయినా రాజకీయ అవగాహన మాత్రం మెండుగా ఉందని గుర్తు చేస్తున్నారు.

# పోరుకు రెడీ అంటున్న కమ్యూనిస్టులు

**హైదరాబాద్ :**

కామ్రేడ్లు ఎన్నికలకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో కీలకమైన అయిదారు వేలమంది క్రియాశీలక కార్యకర్తలతో వచ్చే నెల 9వ తేదీన హైదరాబాద్‌లో ఉమ్మడి సమావేశం నిర్వహించాలని సీపీఐ, సీపీఎంలు నిర్ణయించాయి. ఉభయ పార్టీల నేతలు ఎంబీ భవన్‌లో సమావేశమయ్యారు. సీపీఐ తరపున కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డి, సీపీఎం తరపున తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికలకు అన్ని రకాలుగా సిద్ధం కావాలని నిర్ణయించారు. వచ్చే నెల జరిగే ముఖ్య కార్యకర్తల సమావేశంలో క్యాడర్‌కు మార్గనిర్దేశం చేసేందుకు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలకు చెందిన జాతీయ నేతలను ఆహ్వానిస్తారు. ఎన్నికల నాటి పరిస్థితులను బట్టి బీజేపీయేతర పార్టీలతో పొత్తులుంటాయి. పొత్తులతో సంబంధం లేకుండా 10 వేలకు పైగా ఓట్లున్న.. దాదాపు 20 అసెంబ్లీ నియోజకవర్గాలపై దృష్టి సారించాలని నిర్ణయించారు. పొత్తులో భాగంగా ఆ స్థానాలను కోరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు రెండు పార్టీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకరిపై ఒకరు పోటీ చేసుకోకూడదనేది ప్రాథమికంగా నిర్ణయించారు .రాష్ట్రంలో బీఆర్ఎస్‌తో సీపీఐ, సీపీఎంల పొత్తు వ్యవహారం ఇప్పటికీ గందరగోళంగానే ఉంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ పార్టీలకు పొత్తులో భాగంగా సీట్లు కేటాయించేది లేదని, కేవలం ఎమ్మెల్సీ స్థానాలు ఇచ్చి సరిపెడతామని బీఆర్ఎస్ అంటున్న ట్టు జరుగుతున్న ప్రచారంపై కామ్రేడ్లు ఇంకా గరంగరంగానే ఉన్నారు. అవసరమైతే కాంగ్రెస్‌తోనైనా పొత్తుకు వెనుకాడబోమని వామపక్షాలు భావిస్తు న్నట్లు రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

# ఘనంగా శ్రీ సత్తెమ్మ తల్లి వార్షిక జాతర

**పొలిమేర దేవతకు విశేష పూజలు**

**అన్నసంతర్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు**

**సింహాచలం:**

సింహాద్రినాథుడి సొదరి, అడవివరం శ్రీనివాస్ నగర్ పరిసర 14 గ్రామాల ప్రజల పొలిమేర దేవతగా విరాజిల్లుతున్న శ్రీ సత్తెమ్మతల్లి మరిడిమాంబ అమ్మవారి వార్షిక జాతర మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా మార్చి14న అమ్మవారి పుట్టినరోజు నేపథ్యంలో ఈ జాతరను సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తు వస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, ఆరాధన నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం క్యూలైన్లలో ఉన్న భక్తులకు దర్శనం కల్పించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించుకున్నారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వేంకటరావు ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం బలిరెడ్డి చినఅప్పారావు కుటుంబ సభ్యుల సహకారంతో వేలాది మంది భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. దాతల సహకారంతో ప్రసాదాలు, మజ్జిగ, రస్నా కౌంటర్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆలరించాయి. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా ఆలంకరించారు. భారీగా విద్యుత్ దీపాలంకరణ చేయగా, పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి జాతరలో పాల్గొన్నారు.అమ్మవారిని దర్శించుకున్న నగర మేయర్ దంపతులుసత్తెమ్మ తల్లి, మరిడిమాంబ అమ్మవారి వార్షిక జాతర సందర్భంగా నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు, స్థానిక 93వ వార్డు కార్పోరేటర్. రాపర్తి కన్నా, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు సభ్యులు గంట్ల కనకరాజు,బలిరెడ్డి శ్రీనివాసరావు, స్థానిక నేతలు కర్రి పైడిరాజు, గంట్ల కిరణ్బాబు తదితరులు పాల్గొని, మేయర్ దంపతులను సత్కరించారు.

# బీహార్ లో సీరియల్ కిస్సర్....

**పాట్నా:**

సీరియల్ కిల్లర్ గురించి వినే ఉంటారు. అంటే, వరుసగా మర్డర్లు చేస్తుంటాడు. హత్య చేసి అక్కడి నుంచి ఎస్కేప్ అవుతాడు. కానీ, సీరియల్ కిస్సర్ ను చూశారా? కనీసం విన్నారా? అవును.. వాడో సీరియల్ కిస్సర్. మహిళలే వాడి టార్గెట్. ఎక్కడి నుంచి వస్తాడో, ఎప్పుడు వస్తాడో తెలీదు. సడెన్ గా వెనుక నుంచి వస్తాడు. గట్టిగా పట్టుకుంటాడు. బలవంతంగా పెదాలపై ముద్దు పెడతాడు. ఆ తర్వాత అక్కడి నుంచి ఎస్కేప్ అవుతాడు. ఓ సీరియల్ కిస్సర్.. ఇప్పుడు అక్కడి మహిళలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాడు.బీహార్ లో సీరియల్ కిస్సర్ వ్యవహారం కలకలం రేపుతోంది. జమై జిల్లాలో గుర్తు తెలియని వ్యక్తి.. స్థానిక మహిళలను బెంబేలెత్తిస్తున్నాడు. వెనుక నుంచి వచ్చి బలవంతంగా ముద్దు పెట్టి వెళ్లిపోతున్నాడు. నిన్నమధ్యాహ్నం ఓ షాకింగ్ ఘటన జరిగింది. జమై సదర్ ఆసుపత్రిలో పని చేస్తున్న ఓ మహిళ శుక్రవారం మధ్యాహ్నం ఫోన్ మాట్లాడుతూ బయటకు వచ్చింది. ఆమె ఫోన్ లో మాట్లాడటంలో నిమగ్నమై ఉంది. ఇంతలో ఓ వ్యక్తి సడెన్ గా ఆమె వెనుక నుంచి వచ్చాడు. ఆమె చూసేలోపు ఆమెను గట్టిగా పట్టుకున్నాడు. ఆ తర్వాత బలవంతంగా పెదాలపై ముద్దు పెట్టాడు. ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ మహిళ షాక్ కి గురైంది. ఏం జరిగిందో తెలుసుకునేలోపే ఆ వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. ఇదంతా సీసీటీవీ కెమెరాలో రికార్డ్ అయ్యింది. ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.సీరియస్ కిస్సర్ వ్యవహారం స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. ముఖ్యంగా మహిళలు.. ఒంటరిగా రోడ్డు మీదకు రావాలంటేనే భయపడిపోతున్నాడు. దీనిపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి ఫుటేజీ ఆధారంగా ఆ దుండగుడిని పట్టుకోవాలని డిమాండ్ చేశారు.బాధితురాలు జమై సర్దార్ ఆసుపత్రిలో పని చేస్తుంది. ఆసుపత్రి బయట నిల్చుని ఫోన్ లో మాట్లాడుతుండగా.. వెనక నుంచి వచ్చిన వ్యక్తి బలవంతంగా ముద్దు పెట్టడంతో షాక్ కి గురైంది. ఆ దుండగుడి నుంచి విడిపించుకునేందుకు ఆమె గట్టిగానే ప్రయత్నం చేసింది. కానీ, ఆమె కదలకుండా అతడు గట్టిగా బిగించాడు. కాగా, గుర్తు తెలియని వ్యక్తి ఆసుపత్రి గోడ దూకి మహిళ దగ్గరికి వచ్చాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీరియల్ కిస్సర్ ను వెతికి పట్టుకునే పనిలో పడ్డారు.ఈ ఘటనపై బాధితురాలు స్పందించింది. "ఆ వ్యక్తి ఎవరో నాకు తెలియదు. అతడు గోడ దూకి ఎందుకు వచ్చాడో కూడా తెలీదు. అతడెవరో తెలీదు. అతడికి నేను ఏం చేశాను? అతడు నన్ను గట్టిగా పట్టుకున్నప్పుడు.. నేను విడిపించుకునే ప్రయత్నం చేశాను. ఆసుపత్రి సిబ్బందిని పిలిచాను. వాళ్లు వచ్చేలోపు ఆ దుండగుడు అక్కడి నుంచి పారిపోయాడు" అని బాధితురాలు వాపోయింది. మొత్తంగా సీరియల్ కిస్సర్ వ్యవహారం స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. ముఖ్యంగా మహిళలు భయంతో వణికిపోతున్నారు. వీలైనంత త్వరగా సీరియల్ కిస్సర్ పట్టుకోవాలని పోలీసులను డిమాండ్ చేస్తున్నారు.

# దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక అన్నదాన భవనం

**విజయవాడ**

గత ప్రభుత్వంలో అమ్మవారి ఆలయానికి సంబంధించి సొంత నిధులు ఏమీ ఖర్చు పెట్టలేదు. జగన్మోహన్ రెడ్డి అమ్మవారి దేవస్థానానికి ప్రభుత్వ ఖజానా నుంచి 70 కోట్ల రూపాయలని అభివృద్ధి పనులు నిమిత్తం ఇచ్చారని దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ కర్నాటి రాంబాబు అన్నారు. మంగళవారం అయన మీడియాతో మాట్లాడారు. అన్నదానానికి సపరేట్ భవనాన్ని ఏర్పాటు చేసి అందులో అన్నదానం చేయాలని నిర్ణయించాం. 70 కోట్లలో 30 కోట్ల పెట్టి అన్నదాన భవనాన్ని నిర్మించడానికి సాంక్షన్ చేసాం. 27 కోట్లు పెట్టి ప్రసాదం పోటు భవనాన్ని కూడా నిర్మించడం జరుగుతుంది. అమ్మవారి దేవస్థానంలోనా నిధుల్ని అమ్మవారి దేవస్థానానికి ఖర్చుపెడుతున్నామని అన్నారు.
ప్రతి ఒక్కరినీ టెండర్లకు పిలవడం జరిగింది. ట్రస్ట్ బోర్డ్ లో అందరూ తీసుకున్న నిర్ణయానికి ఈవో ఆమోదించారు. దానికి ఈ ఓ కి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. శివాలయానికి ఐదు కోట్ల 60 లక్షలు రూపాయలు వెచ్చించి పునర్నిర్మానం చేస్తున్నాం. చిన్న చిన్న అభివృద్ధి కార్యక్రమాలు అన్నీ కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డబ్బుమొత్తం అభివృద్ధి కార్యక్రమాలు చేయబడుతున్నాం. 13 కోట్లు పెట్టి వెలివేటెడ్ క్యూ లైన్స్ ని కూడా ఏర్పాటు చేయనున్నాము దానికి సంబంధించి టెండర్లను కూడా ఇప్పటికే పిలిచామని అన్నారు.

# హస్తినలో తెలంగాణ రాజకీయం

**హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయాలు ఢిల్లీ బాట పట్టాయా? ఢిల్లీ కేంద్రంగానే రాష్ట్ర రాజకీయాలు, రాజకీయ వ్యూహాలు రూపు దిద్దుకుంటు న్నాయా? అంటే అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ముఖ్యంగా ఢిల్లీ మద్యం కుంభకోణంలో తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు కుమార్తె, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుట్ల కవిత ప్రమేయం బయటకు వచ్చిన తర్వాత రాష్ట్ర రాజకీయ రణక్షేత్రం హస్తినకు మారిందని అంటున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధిచి కవితకు ఈడీ సమన్లు జారీ చేయడం, అంతకు ముందే ఆమె మూడు దశాబ్దాలకు పైగా త్రిశంకు స్వర్గంలో తేలియాడుతున్న మహిళా రిజర్వేషన్ బిల్లును భూమార్గం పట్టించేందుకు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద 'దీక్ష' చేయడం, ఆ వెంటనే, ఈడీ విచారణకు హాజరు కావడం ఇలా ఒకదాని వెంట ఒకటిగా చోటు చేసుకున్న పరిణామాలతో తెలంగాణ రాజకీయాలకు ఢిల్లీ కేంద్రంగా మారింది.అన్నిటినీ మించి ఢిల్లీ మద్యం కేసులో అంతవరకు ఎక్కడా ప్రత్యక్షంగా జోక్యం చేసుకోని ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు ఆమెను ఒంటరిగా ఢిల్లీకి పంపి, ఆ వెనక కేటీఆర్, హరీష్ రావు సహా అరడజను మందికి పైగా మంత్రులను ఢిల్లీకి పంపారు. అంతకు ముందే కవిత దీక్ష కోసం ఢిల్లీ చేరిన బీఆర్ఎస్ భారత జాగృతి (తెలంగాణ జాగృతి) శ్రేణులు, ఈడీ విచారణ జరిగిన రోజు (మార్చి11)న ఢిల్లీ లో హల్ చల్ సృష్టించారు. ఇలా ఒక్కసారిగా, ఇటు పార్టీని, అటు ప్రభుత్వాన్ని అవినీతి ఆరోపణలు ఎదుర్కుంటున్న ఎమ్మెల్సీ కవితకు అండగా రంగంలోకి దింపడంలో కేసీఆర్ వ్యూహం ఏమైనప్పటికీ ఆ రోజుకు కవిత బయట పడ్డారు. కానీ, కథ అంతటితో ముగియ లేదు. మళ్ళీ మార్చి 16న మరోమారు విచారణకు హజరు కావాలని ఈడీ కవితకు అదే రోజున తాజా సమన్లు జారీ చేసింది. మంత్రులంతా మళ్ళీ కట్టకట్టుకుని ఢిల్లీ వెళ్తారా? ప్రత్యేక విమానాలు, రైళ్ళలో జనాలను, కార్యకర్తలను ఢిల్లీకి తరలిస్తారా? ఢిల్లీలో మళ్ళీ అదే హల్ చల్ సృష్టిస్తారా అనేది పక్కన పెడితే, ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎదుర్కుంటున్న భారీ అవినీతి ఆరోపణ ఢిల్లీలో గజ్జెకట్టి ఆడేందుకు సిద్ధమవుతోంది. అవును ప్రధాని నరేంద్ర మోడీ మొదలు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటీఎం గా అభివర్ణించిన కాళేశ్వరంలో అవినీతిపై విచారణకు డిమాండ్ చేస్తూ వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నాకు సిద్దమయ్యారు. కాళేశ్వరం అవినీతి గురించి ఇప్పటికే షర్మిల కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు ఫిర్యాదు చేశారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దృష్టికీ తీసుకెళ్లారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ను అతిపెద్ద కుంభకోణంగా ఆమె మొదటి నుంచి ఆరోపిస్తున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు అయితేనేమీ లేదంటే ఇతర సమాచారం ఆధారంగా అయితే నేమి, కాగ్ కాళేశ్వరం ప్రాజెక్ట్ పద్దులపై ప్రత్యేక ఆడిట్ ప్రారంభించింది. ఢిల్లీలో కాళేశ్వరం అవినీతికి వ్యతిరేకంగా ఢిల్లీలో ప్రదర్శన నిర్వహించారు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ భవనం వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుంది. దీనికి మద్దతు ఇవ్వాలంటూ ప్రతిపక్ష పార్టీలకు షర్మిల విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం అవినీతి విషయంలో తాను చేస్తోన్న పోరాటానికి కలిసి రావాలని కోరారు. తెలంగాణలో బీఆర్ఎస్ యేతర పార్టీలు తనకు అండగా నిలుస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ నిరసన ప్రదర్శనకు సంఘీభావం తెలియజేయాలని కోరారు. షర్మిల కాళేశ్వరం దేశంలోనే అతి పెద్ద స్కామ్ గా పేర్కొన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 16.46 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలనే ఉద్దేశంతో రూ.38,000 కోట్ల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. అయితే, రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన కేసీఆర్ కమీషన్లకు కక్కుర్తిపడి రీ- డిజైన్ పేరుతో ప్రాజెక్టు వ్యయాన్ని మూడు రెట్లు పెంచారని విమర్శించారు. 18 లక్షల ఎకరాలకు నీళు ఇస్తామని చెప్పి లక్షన్నర ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని అన్నారు. నాణ్యత లేని పనులు చేపట్టి మూడు సంవత్సరాలే కాళేశ్వరాన్ని ముంచారని ధ్వజమెత్తారు. మెగా కంపెనీతో కుమ్మక్కై దాదాపు 70 వేల కోట్ల అవినీతికి తెరలేపారని ఆరోపించారు.
కాళేశ్వరం అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఇదివరకే తాము కాగ్, సీబీఐకి ఫిర్యాదు చేశామని వైఎస్ షర్మిల గుర్తు చేశారు. రేపు ఢిల్లీలోని జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నందున ఈ విషయాన్ని ఎంపీల దృష్టికి తీసుకుని రావాలనేదే తమ ఉద్దేశమని అన్నారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని కేంద్రం చెప్పడం కాదని, విచారణ జరిపించి.. అది నిజం అని నిరూపించాలని డిమాండ్ చేశారు. నిజానికి, కవిత లిక్కర్ కుంభకోణం కంటే, కాళేశ్వరం ప్రాజెక్ట్ పై వస్తున్న అవినీతి ఆరోపణలు కాంగ్రెస్ సహా అన్ని పార్టీలూ చేస్తున్నాయి. అయితే షర్మిల సంధించిన బాణం, బీఆర్ఎస్ నే కాదు, కాంగ్రెస్ పార్టీని కూడా ఇరకాటంలోకి నెట్టేస్తుందని అంటున్నారు.

# టీఎస్పీఎస్సీ పేపర్లీక్లో విస్తుపోయే నిజాలు

**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ లో క్వశ్చన్ పేపర్ల లీక్ వ్యవహారంలో కొనసాగుతున్న విచారణలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఉద్యోగి ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తిని కస్టడీలోకి తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల మరిన్ని వివరాలు బయటికి వస్తాయని అనుకుంటున్నారు. ఇప్పటికే కొన్ని కీలక వివరాలు బయటికి వచ్చాయి. నిందితుడు ప్రవీణ్ కుమార్ టీఎస్పీఎస్సీలో 2017లో జూనియర్ అసిస్టెంట్గా చేరాడు. అక్కడే నాలుగేళ్ల పాటు వెరిఫికేషన్ డిపార్ట్ మెంట్ లో విధులు నిర్వహించాడు. అలా వెరిఫికేషన్ విభాగానికి వచ్చే మహిళల ఫోన్ నెంబర్లను సేకరించేవాడు. వెరిఫికేషన్ విభాగానికి వచ్చే మహిళలకు దరఖాస్తులో భాగంగా వచ్చే సమస్యలను పరిష్కరించేవాడు. అలా వారితో మాటలు కలిపి సాన్నిహిత్యం పెంచుకొని కొంత మంది మహిళలతో శారీరక సంబంధం పెట్టుకున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ప్రవీణ్ సెల్ఫోన్లో ఎక్కువగా ఆడవారి ఫోన్ నెంబర్లు గుర్తించారు. వాట్సాప్ ఛాటింగ్లోనూ మహిళల న్యూడ్ ఫొటోలు, వీడియోలు కూడా పోలీసులు గుర్తించారు. ఏఈ పరీక్ష పత్రం కూడా రేణుక అనే ఓ యువతి కారణంగానే లీక్ అయిందని పోలీసులు తేల్చారు.టౌన్ బిల్డింగ్ ప్లానింగ్ ఆఫీసర్ పరీక్ష, ఈ నెల 15న జరగాల్సిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పరీక్షలకు సంబంధించిన పేపర్ లీకేజీ వ్యవహారం దుమారం రేపుతోన్న సంగతి తెలిసిందే. ప్రవీణ్ కుమార్ నుంచి క్వశ్చన్ పేపర్ ను కొన్నట్లుగా భావిస్తున్న ముగ్గురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. వీరి నుంచి పేపర్లు కొనుగోలు చేసినట్టుగా సమాచారం ఉన్న మరో నలుగురు అభ్యర్థులను కూడా విచారణ చేస్తున్నారు. అయితే, ఈ పేపర్ లీక్ కుంభకోణంలో ప్రవీణ్ కుమార్ ఒక్కరే ఉన్నారా? లేక టీఎస్పీఎస్సీలోని ఇతర ఉద్యోగులు కూడా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకోసం టాస్క్ఫోర్స్ పోలీసులను రంగంలోకి దించారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## శ్రీస్వామి అమ్మవార్ల సేవలో విశాఖ శ్రీ శారదాపీఠ ఉత్తర పీఠాధిపతి

**శ్రీశైలం**



విశాఖ శ్రీశారదా పీఠం ఉత్తర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామివారు మంగళవారం రోజూ ఆలయాన్ని సందర్శించి శ్రీ స్వామి అమ్మవార్లను సేవించారు. మంగళవారం ఉదయం ఆలయానికి చేరుకున్న పీఠాధిపతివారికి ఆలయ రాజగోపురం వద్ద కార్యనిర్వహణాధి కారి.ఎస్.లవన్న ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేదపండితులు, దేవస్థాన ఆస్థాన సిద్ధాంతిగారైన శ్రీ పండిత బుట్టి వీరభద్ర దైవజ్ఞ, పలువురు అధికారులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.తరువాత పిఠాధిపతులు స్వామివారికి అభిషేకాన్ని జరిపించుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ తరువాత అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో ఉత్తరాధికారి గౌరవార్థం దేవస్థానం వేదగోష్ఠిని నిర్వహించి, వారిని సత్కరించింది

## ఓటు వేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు

**సిద్ధవటం**

మండలంలో జరిగిన గ్రాడ్యువెట్ ఎలక్షన్ లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి కి మద్దతుగా ఓటు వేసిన తెలుగుదేశం అభిమానులకు. మద్దతుదారుల కు పేరు పేరు న తెలుగుదేశం పార్టీ పార్లమెంటు ప్రధాని కార్యదర్శి అండ్లూరి నాగముని రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు పారు ఇందులో రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, బి సి సెల్ అధికార ప్రతినిధి జింక శివ,టిఎన్ యు ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బ య్య, బండి ఓబులేసు, కమ్మపాలెం యువనాయకుడు దారపునేని రాజ నాయుడు, నాగభూషణం, బాలసుబ్బయ్య, శ్రీను,శివ, సామా శ్రీనివాసులు, బొడిచర్ల శ్రీను, ఎద్దుల శ్రీను, పొట్టాసివ, రాంప్రసాద్ యాదవ్, మరియు టీడీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

## నోబెల్ గ్రహీత ఆల్బర్ట్ ఐన్ స్టీన్ జయంతి

**డోన్**

డోన్ పట్టణం పాతపేటలో మంగళవారం ఉదయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన ఆల్బర్ట్ ఐన్‌స్టైన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు,ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయుడు సుబ్బారాయుడు మాట్లాడుతూ 'ఐన్ స్టీన్' 14 మార్చి 1879 లో జన్మించారన్నారు..అతను సాపేక్ష సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశాడు, అతను సైద్ధాంతిక భౌతిక శాస్త్రానికి చేసిన సేవలకు, ఫోటో విద్యుత్ ఫలితానికి 1921 సంవత్సరానికి గాను భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని అందుకున్నాడు, అతని ప్రసిద్ధ సమీకరణం : ఇ = యంసిగీ2. (ఇ = శక్తి , యం = ద్రవ్యరాశి , సి = కాంతి వేగం). అనేక విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్ లు పొందాడు ఐన్‌స్టైన్ కి సైన్స్ మరియు గణితాన్ని అధ్యయనం చేయడానికి ఆసక్తి కలిగించింది. అతని దిక్సూచి అతనికి సైన్స్ ప్రపంచాన్ని అన్వేషించడానికి ఆలోచనలను ఇచ్చింది. పదార్థం-శక్తి సమానత్వ సిద్ధాంతం ( ఇ = యంసిగీ2),ప్రత్యేక సాపేక్షత సిద్ధాంతాన్ని ఐన్‌స్టైన్ 1905లో తన పేపర్ 'ఆన్ ది ఎలక్ట్రోడైనమిక్స్ ఆఫ్ మూవింగ్ బాడీస్'లో వివరించాడుఆల్బర్ట్ ఐన్‌స్టీన్ యొక్క ఇ =యంసి2 సూత్రంలో శక్తికి ద్రవ్యరాశితో సంబంధం కలిగి ఉంటుంది,ఇ =యం సిగీ2, ద్రవ్యరాశి-శక్తి సమానత్వం అని కూడా పిలుస్తారన్నారు,అలాగే పైడే గురించి లక్ష్మి కాంతరెడ్డి మాట్లాడుతూ 22/7 ను పై అంటారని, దాని విలువ 3.14 అంటే మార్చి 14 గా తెలిపారు,ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివ ప్రసాద్, వెంకటేశ్వర్ గౌడ్, వెంకట రమణ, లక్ష్మయ్య, చంద్రశేఖర్ గౌడ్, సుబ్బారెడ్డి, అల్లిపీరా,మధుసూదన్ రెడ్డి, మద్దిలేటి, శ్రీనివాసులు, భూకాంతరెడ్డి,సురేష్, సుభాన్, జయసుబ్బారాయుడు, సంజీవరెడ్డి, ఆదినారాయణ, శివన్న, భారతి, శ్రీ కళ, లక్ష్మి ప్రభావతి, లీలావతమ్మ, రామ్మూర్తి, ముని రాజు మహేష్ అల్లిపీరా తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు ను దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత

**జగిత్యాల,**

రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తనయ,నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. వేకువజామున కొండపైకి చేరుకున్న కవిత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ,అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు జితేంద్ర ప్రసాద్, ఉప ప్రధానార్చకులు చిరంజీవి, ఎస్పై చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.ఇటీవల ఈడీ విచారణ నేపథ్యంలో కవిత కొండగట్టు అంజన్నను దర్శించుకోవడం పట్ల ప్రజాప్రతినిధులు, ప్రజలుఅంజన్న రక్ష కోరుతూ దర్శనానికి వచ్చినట్లు పలువురు చర్చించుకున్నారు. ఇదిలా ఉండగా, ఆలయ అధికారులకు, స్థానిక ఎమ్మెల్యే, పార్టీ నాయకులు సమాచారం ఇవ్వకుండా రహస్యంగా ఒక్కరే దర్శనం చేసుకోవడం గమనార్హం, కవిత సమాచారం ఇవ్వకపోవడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు విస్మయం వ్యక్తం చేసినట్లు సమాచారం

# ఓఆర్ ఆర్ చుట్టూ సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్

**హైదరాబాద్:**

ప్రపంచ స్థాయి వసతులు, సదుపాయాలతో హైదరాబాద్ నగర వాసుల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తోంది తెలంగాణ ప్రభుత్వం. రోడ్లు, పబ్లిక్ ట్రాన్స్ పోర్టు తదితర అంశాల్లో అత్యుత్తమ సేవలు అందించేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే అనేక ప్రణాళికలను అమలు చేస్తోంది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ సోలార్ రూఫ్ టాప్ సైకిల్ ట్రాక్ నిర్మాణాన్ని హెచ్ఎండీఏ చేపట్టిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ ప్రమాణాలతో చేపట్టిన సోలార్ రూఫ్ టాప్ సైకిల్ ట్రాక్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వీలైనంత త్వరగా సైకిల్ ట్రాక్ నగర వాసులకి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.హైదరాబాద్ నగరంలో సైక్లింగ్ చేసే వారి సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగింది. వివిధ రంగాలకు చెందిన వారు సైకిల్ రైడ్స్ కు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆరోగ్యంపై పెరిగిన అవగాహనతో కూడా చాలా మంది సైక్లింగ్ పై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో.. నగరవాసుల అభిరుచికి అనుగుణంగా ఔటర్ చుట్టూ అంతర్జాతీయ ప్రమాణాలతో సైకిల్ ట్రాక్ నిర్మాణం చేపడుతోంది హెచ్ఎండీఏ. రింగ్ రోడ్డు వెంట 23 కిలోమీటర్ల పొడవునా నిర్మిస్తున్న ఈ పనులను త్వరగా పూర్తి చేసి నగరవాసులకు అందుబాటులోకి తెచ్చేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రణాళికను రూపొందించిన విషయం తెలిసిందే. ఇలాంటి సైకిల్ ట్రాక్ ఇప్పటి వరకు జర్మనీ, దక్షిణ కొరియాల్లో మాత్రమే ఉండగా భారత్ లో తొలిసారిగా హైదరాబాద్‌లో అందుబాటులోకి వస్తుండటం విశేషం.మొదట ఐటీ కారిడార్ పరిధిలోని ఈ ట్రాక్ ను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. నానక్‌రాంగూడ, నార్సింగి, తెలంగాణ పోలీస్ అకాడమీ, కోకాపేట, కొల్లూరు ప్రాంతాల్లోని ఓఆర్ఆర్ లోపలి వైపు ఉన్న సర్వీసు రోడ్డులో 4.5 మీటర్ల వెడల్పుతో ఈ ట్రాక్‌ను నిర్మిస్తున్నారు. ట్రాక్ చుట్టూ సివిల్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ట్రాక్ పొడవునా పచ్చదనం, గార్డెన్ ల ఏర్పాటుకు సంబంధించిన వర్క్స్ ఇటీవలే ప్రారంభమయ్యాయి. ట్రాక్ పొడవునా సోలార్ రూఫ్ టాప్ ప్యానెళ్ల అమరిక పనులు మరో 10 రోజుల్లో మొదలు కానున్నాయి. ఇవి కూడా అతి త్వరలోనే పూర్తవుతాయి. ఈ పనులన్నీ వీలైనంత త్వరగా పూర్తయ్యే అవకాశం ఉందని.. ఆ వెంటనే నగర వాసులకి ట్రాక్ ని అందుబాటులోకి తెస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ట్రాక్ చుట్టూ సైకిళ్లు అద్దెకిచ్చే కేంద్రాలు, మరమ్మతులు చేసే వ్యవస్థ, ఫుడ్ కోర్టులు, పార్కింగ్ సైతం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# నూటికో..కోటికోక్కరు ఉంటారు

**సమాజ హితంలో రాజయ్య దంపతులను చూసి చాలా నేర్చుకోవాలి..**

**- భూదేవి అంత ఓర్పు.. భూలక్ష్మి లోనే కనిపించింది...**

**- అనాధలను కడుపులో పెట్టుకొని పెంచుతున్న గొప్ప దంపతులు...**

**- ఆశ్రమ నిర్వాహకులను సత్కరించిన బిఆర్ ఎస్ నాయకులు దేవి లక్ష్మీ నరసయ్య...**



**కమాన్ పూర్**

బంధాలకు... బంధుత్వాలకు దూరంగా... స్వార్థాలకు.. ఆర్థిక ప్రయోజనాలకు దగ్గరగా బతుకుతున్న నేటి ఆధునిక ప్రపంచములో.. పోచంపల్లి రాజయ్య-భూలక్ష్మి లాంటి పుణ్య దంపతులు నూటికో..కోటికో ఒక్కరు ఉంటారు అనడంలో అతిశయోక్తి లేదని బిఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు దేవి లక్ష్మి నర్సయ్య అన్నారు. గోదావరిఖని గాంధీ నగర్ లో గల ఎం డి హెచ్ డబ్ల్యు ఎస్అనాథ పిల్లల సంరక్షణ కేంద్ర వ్యవస్థాపకులు పోచంపల్లి భూలక్ష్మి - రాజయ్య దంపతుల 27వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం రాత్రి ఆశ్రమం సందర్శించిన ఆయన.. రాజయ్య దంపతుల తో కేకు కట్ చేయించి శాలువా తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మనలో చాలామంది ఏదైనా శుభ కార్యాలు ఉంటే.. సామాజిక సేవా దృక్పథంతో అనాధ పిల్లల మధ్య వేడుకగా చేసుకొని... వారికి ఒక పూట అన్నం పెట్టడం చూస్తున్నామని.. కానీ రాజయ్య దంపతులు వారి దైనందిన జీవితంలో వారి గురించి మరిచి.. ఎంతసేపు అనాధ పిల్లల కోసమే ఆలోచించి..వారికి గొప్ప భవిష్యత్తు అందిస్తున్నారని పేర్కొన్నారు. అమ్మ ప్రేమ, నాన్న అనురాగానికి నోచుకోలేదు ఎంతోమంది అనాధ చిన్నారులను చేరదీసి... పేగు బంధం కాకపోయినా అంతకంటే ఎక్కువగా భావించి అన్నితామై సాకుతూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఒకరు లేదా ఇద్దరు పిల్లలను పెంచి పెద్ద చేయడమే కష్టతరం అవుతున్న ఈ రోజుల్లో ఇంతమంది చిన్నారులను అక్కున చేర్చుకొని అమ్మ ఒడిలా ఆదరిస్తున్న గొప్ప దంపతులని అభినందించారు. విధి వంచితులైన అనాధ పిల్లలకు అమ్మ నాన్నలుగా కొత్త జీవితాలను ప్రసాదిస్తున్న ఈ దంపతులు దైవదూతలని కొనియాడారు. ఈ దంపతులకు ఆ భగవంతుడు ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆశ్రమానికి తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం ఆశ్రమ పిల్లలు కలిసి రాజయ్య దంపతులచే కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. నిజంగా అమ్మ నాన్నలు ఉంటే కూడా మమ్మల్ని ఇంతగా చూసుకుంటారో లేదోనని భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో ఆశ్రమ పిల్లలు స్థానికులు పాల్గొన్నారు..

# పవన్ సభలో ఏం చెబుతారో ముందే చెబుతా...

**విజయవాడ**



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోని కాపు నేతలను బూతులు తిట్టటానికే పవన్ సభ పెడుతున్నారని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ పేరుకు మాత్రమేనని, అక్కడ జరిగేది దూషణల సభ అని వెల్లడించారు.జనసేన సభ కేవలం చంద్రబాబు, పవన్ తస్మదీయ దూషణల సభ మాత్రమేనని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. మనం ఏం చేశాం... మనలో లోపాలేంటి అనేది చర్చించుకోవడం రాజకీయ పార్టీ లక్షణమని అయితే అందుకు భిన్నంగా జనసేన ఆవిర్భావ సభ ఉంటుందని ముందుగానే చెప్పారు.చంద్రబాబు సేవ కోసమే పవన్ రాజకీయ పార్టీ పెట్టారని వ్యాఖ్యానించారు పేర్నినాని. తన పార్టీని అభిమానించే వారందరినీ చంద్రబాబుకు ఓటేయమని పవన్ చెబుతున్నారని అన్నారు. చంద్రబాబు మేలు కోసమే పవన్ పని చేస్తున్నారని తెలిపారు. ఇప్పటం సభకు మచిలీపట్నం సభకు పెద్ద తేడా ఉండదన్నారు. జగన్ మోహన్ రెడ్డిని తనను, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోని ఇతర కాపు నాయకులను దూషించడమే పవన్ పని అని తెలిపారు. మచిలీపట్నం సభలో జరగబోయేది ఇదే అంటూ పేర్ని నాని సెటైర్లు వేశారు. మచిలీపట్నంలో జరగబోయేది ఆవిర్భావసభ కాదు అస్మదీయ దూషణ సభ అని కాపులను చంద్రబాబు దగ్గర తాకట్టు పెట్టడానికే పవన్ తాపత్రయమని వ్యాఖ్యానించారు పేర్ని నాని. పవన్ ఎప్పటికీ మారడని కౌంటర్ ఇచ్చారు. సినిమాలు ఫ్లాప్ అయితే నష్టాలొస్తాయని,కానీ ఫ్లాప్ అయిన సినిమాకు కూడా పవన్కు లాభాలొచ్చేది ఇక్కడేనని ఎద్దేవా చేశారు. ప్యాకేజ్ స్టార్ అంటే పవన్కు కోపం వస్తుందని, అయితే ఏబీఎన్ రాధాకృష్ణ వెయ్యికోట్ల స్టార్ ప్యాకేజ్ అంటే ఆనందపడుతున్నారని నాని వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో ఎవరిపై విమర్శలు చేస్తారో, ఎవరిని టార్గెట్ చేసి మాట్లాడతారో తనకు ముందే తెలుసని నాని వ్యాఖ్యానించారు. పవన్ టార్గెట్ జగన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని, తెలుగుదేశాన్ని కాపాడుకునేందుకు పవన్ అన్ని ప్రయత్నాలు చేస్తారని అన్నారు. పవన్ ఇలాంటి రాజకీయాలు చేస్తున్నందునే ప్రజలు గుర్తించటం లేదని వ్యాఖ్యానించారు. పవన్ తన సిద్దంతాలను గురించి, పార్టీ భవిష్యత్ కార్యచరణ, వచ్చే ఎన్నికల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకుం టారు, ప్రజలకు ఏం చేస్తారో చెబితే బాగుంటుందని నాని వ్యాఖ్యానిం చారు. మాజీ మంత్రి పేర్ని నాని సొంత నియోజకవర్గంలోనే పవన్ సభ పెడుతున్నారు. దీంతో రాజకీయంగా ఈ వ్యవహారంపైనే టాపిక్ నడుస్తోంది. మొదటి నుంచి పవన్ను టార్గెట్ చేస్తూ ఇష్టానుసారంగా కామెంట్స్ చేసిన పేర్ని నాని పై జనసేన నాయకులు,కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. ఈ టైంలోనే జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ ఖరారు కావటంతో అందరూ అక్కడే ఫోకస్ పెట్టారు. దీంతో ఈ వ్యవహారం రాజకీయంగా హీట్ పెంచింది. గతేడాది ఇప్పటంలో పవన్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ తరువాత నుంచి ఇప్పటం గ్రామంపై అధికారులు ఇళ్ళ నిర్మాణాల తొలగింపులు చేయటం, రాజకీయగా దుమారాన్ని రాజేసింది. ఎడాది గడుస్తున్నాఇప్పటికి ఇప్పటంలో పవన్ నిర్వహించిన పార్టీ వ్యవస్థాపక సభకు సంబంధించిన ఆనవాళ్ళు కనిపిస్తుండటం విశేషం. అంటే రాజకీయంగా పవన్ నిర్వహించిన సభకు ఎలాంటి హైప్ క్రియేట్ అవుతుంద నేందుకు ఇప్పటం గ్రామం కేంద్రంగా నిలిచింది

## కుక్క విశ్వాసం ..చనిపోయిన యజమాని కోసం ఆసుపత్రిలో పడిగాపులు

**చెన్నయ్**

ఆసుపత్రిలో చేరిన తన యజమాని చనిపోయాడన్న విషయం తెలియక ఆయన కోసం బయటే పడిగాపులు కాస్తోంది ఓ శునకం. వచ్చేపోయేవాళ్లను గమనిస్తూ, తన యజమాని కోసం కన్నీటితో ఎదురు చూస్తోంది. సేలం నగరంలోని ప్రభుత్వ మోహన కుమారమంగళం జనరల్ ఆసుపత్రిలో మూడు నెలల క్రితం గుండెనొప్పితో) బాధపడిన ఓ రోగిని కుటుంబ సభ్యులు చేర్పించారు.రోగితో పాటు ఆయన పెంచుకున్న కుక్క కూడా ఆసుపత్రికి తొలిరోజు వచ్చింది. అయితే ఆసుపత్రి సిబ్బంది కుక్కను ఆసుపత్రి బయటే నిలిపేశారు. దీంతో అది గేటు వద్దనే వుండిపోయింది. ఆసుపత్రిలో చేరిన రోగి.. కొద్దిసేపటికే కన్నుమూశాడు. దాంతో వైద్యులు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పజెప్పడంతో.. వారు వెనుక వైపు నుంచి తీసుకొనివెళ్లిపోయారు. అయితే ఈ విషయం తెలియని కుక్క.. తన యజమాని కోసం గేటు వద్దనే ఎదురు చూస్తోంది.ఎవరైనా ఏదైనా ఇస్తే తింటూ అక్కడే తన యజమాని కోసం ఆశగా ఎదురు చూస్తోంది. ఆసుపత్రి సిబ్బంది వచ్చి తరిమేసినా అది అక్కడి నుంచి కదలడం లేదు. దీనిపై ఆసుపత్రి సిబ్బంది మాట్లాడుతూ.. ఒక రోగితో పాటు వచ్చిన కుక్క.. ఆయన కోసమే ఎదురు చూస్తూ బక్కచిక్కిపోతోందని, ఇప్పటికైనా దాని యజమాని కుటుంబసభ్యులెవరైనా వచ్చి దానిని తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

## వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన స్వరూపానందేంద్ర స్వామి

**విశాఖపట్నం**

విశాఖ జిల్లా భీమిలి రుషికొండలో వెలసిన వేంకటేశ్వర స్వామి తిరుమల వెంకన్న ప్రతిరూప మేనని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతు లు స్వరూపానందేంద్ర స్వామి అన్నా రు. ఏడాది క్రితమే ప్రతిష్ట జరిగినా అతి తక్కువ కాలంలోనే రోజుకు 2వేల నుండి 15వేల మంది వరకు భక్తులు వెంకన్న అనుగ్రహం కోసం రుషికొండ వస్తుండటాన్ని బట్టి దివ్యక్షేత్రంగా ఇది విరాజిల్లుతోందని తెలిపారు. రుషికొం డలో పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలకు టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో పాటు స్వరూపానందేంద్ర స్వామి హాజరయ్యా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో అందమైన సాగరతీరం కలిగిన నగరం విశాఖేనని అన్నారు. ఆంధ్ర రాష్ట్రానికీ, విశాఖకూ పెట్టుబడులు రావాలని, అభివృద్ధి చెందాలన్న సంకల్పంతో వైవీ సుబ్బారెడ్డి సంకల్పానికి వెంకన్న అనుగ్రహం ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. స్వరూపానందేంద్ర స్వామిని టీటీడీ పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

## జోరుగా క్రికేట్ మ్యాచ్ టిక్కెట్ల అమ్మకాలు

**విశాఖపట్నం**

క్రికేట్ అభిమానులు ఎప్పు డెప్పుడా అని ఎదురు చూస్తున్న తరుణం రానే వచ్చింది.ఈ నెల 19న విశా ఖలో జరగనున్న భారత్-ఆస్ట్రేలియా రెండో వన్డే మ్యాచ్ టికెట్ల విక్రయాలు ప్రారంభకావడంతో భారీగా అభిమా నులు తరలివచ్చాడు.ఆన్లైన్లో ఈ నెల 10 నుంచే అందుబాటులో ఉంచ గా, ఆఫ్లైన్లో నుంచి విక్రయిస్తున్నా రు. విశాఖ నగరంలోని పీఎంపాలెం క్రికెట్ స్టేడియం-బి మైదానం, జీవీఎంసీ మున్సిపల్ స్టేడియం, రాజీవ్గాంధీ క్రీడా ప్రాంగణం వద్ద టికెట్ల విక్రయాలు జరుగుతున్నాయి. టికెట్ కౌంటర్ల వద్ద వేకువజాము నుంచే క్రికెట్ అభిమాను లు బారులు తీరారు.టికెట్ల కోసం పలు వురు మహిళలలు చంటి పిల్లలతోనూ విక్రయ కేంద్రాల వద్దకు వచ్చారు. రద్దీ ని నియంత్రించేందుకు పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు.భారీగా తరలి వచ్చిన అభిమానులతో విక్రయ కేంద్రా ల వద్ద సందడి వాతావరణం నెలకొం ది.దీంతో హాట్ కెకుక్కలా టిక్కెట్ల అక్రమాలు జోరందుకున్నాయి

## కుల బహిష్కరణపై డీఎస్పీ విచారణ

**వేములవాడ**

వేములవాడ రూరల్ పరిధిలోని జయవరం గ్రామానికి చెందిన సార శ్రీనివాస్ గౌడ్ తనను కులం నుండి బహిష్కరించారని 11మందిపై దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి నట్టు వేములవాడ రూరల్ ఎస్ఐ నాగరాజు తెలిపారు. జయవరం గ్రామంలో ఇటీవల ఎల్లమ్మ గుడి నిర్మాణం చేపట్టగా అట్టి నిర్మాణం వద్దకు రావద్దని కుల బహిష్కరణ చేసినట్లుశ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదు మేరకు వేములవాడ డిఎస్పీ ఆధ్వర్యంలో విచారణ కోసం జయవరం గ్రామానికి వెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.

## పసికందు మృతదేహం లభ్యం

**పులివెందుల**

కడప జిల్లా పులివెందుల పట్టణ పరిధిలోని క్రిస్టియన్ కాలనీలో - గుర్తుతెలియని వ్యక్తులు పసికందును పడేశారు. తల్లి కడుపు నుంచి బయటికి వచ్చిన పసికందును మురుగు కాలువలో పడేయడంతో పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. కాలువలో పసికందు శవం తేలియాడుతూ ఉండగా స్థానికులు గుర్తించారు. ఈ ఘటనపై పులివెందుల పోలీసులు విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఫాంకేసు ఎదురుతిరుగుతోంది...

**హైదరాబాద్ :**

ఫాం హౌస్ కేసులో కేసీఆర్ వ్యూహం దెబ్బతింది. లిక్కర్ స్కాంలో తన కుమార్తె పై సీబీఐ, ఈడీ నజర్ కు కౌంటర్ అన్నట్లుగా ఫామ్ హౌజ్ లో ఎమ్మెల్యేల కొనుగోలు, బేరసారాలకేసును సిట్ కు అప్పగించాలని భావించిన ఆయనకు చుక్కెదురైంది. కేంద్రాన్నికి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఉంటే.. మాకు రాష్ట్ర దర్యాప్తు సంస్థలున్నాయంటూ అప్పట్లో ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి కూడా. అయితే తన దొరికిన ఆయుధంగా కేసీఆర్ భావించిన ఫామ్ హౌజ్ కేసు దర్యాప్తు ఇప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్థ చేతిలోకి వెళ్లి పోయింది.ఫామ్ హౌస్ కేసును సీబీఐకి అప్పగిస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పుపై స్టే ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈ కేసులో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగుతుందని స్పష్టం చేస్తు విచారణను జులై 31కి వాయిదా వేసింది. దీంతో ఫామ్ హౌస్ కేసు దర్యాప్తు ప్రారంభించుందుకు ఇప్పుడిక సీబీఐకి ఎటువంటి అడ్డంకులూ లేదు. కేసు సీబీఐ చేపడితే సాక్ష్యాలు నాశనమైపోతాయంటూ వస్తున్న తెలంగాణ ఇప్పుడు ఏం చేస్తుందో చూడాలి. ఇప్పటి వరకూ ఈ కేసు దర్యాప్తు విషయంలో ఇప్పుడు సీబీఐ రంగంలోకి దిగడానికి సుప్రీం కోర్టు స్టే ఇస్తుందా లేదా అన్నది వేచి చూడడానికే అని చెప్పవచ్చు. ఇప్పుడు సుప్రీం కోర్టు స్టే నిరాకరించడంతో సీబీఐ దర్యాప్తునకు రూట్ క్లియర్ అయిపోయింది. దీంతో ఏ క్షణంలోనైనా దర్యాప్తు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. అసలు గతంలోనే.. సీబీఐ ఈ కేసుకు సంబంధించిన వివరాలు, ఆడియో, వీడియో, డాక్యుమెంట్లు అందజేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి పలు మార్లు లేఖలు రాసింది. అయితే ఆ లేఖలకు తెలంగాణ సర్కార్ స్పందించలేదు. సరే సుప్రీం కోర్టు పూర్థి స్థాయిలో స్టేకు నిరాకరించిన తరువాత చూద్దాం అన్నట్లుగా సీబీఐ కూడా అప్పట్లో మిన్నకుండిపోయింది. ఇప్పుడు ఈ కేసు దర్యాప్తు చేపట్టేందుకు లైన్ క్లియర్ అయిపోయిన నేపథ్యంలో ఏ క్షణంలోనైనా సీబీఐ కేసు దర్యాప్తును చేపట్టే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఫాం హౌస్ కేసు తెలంగాణ సర్కార్ మెడకు చుట్టుకున్నట్లే కనిపిస్తోంది ఈ కేసు విషయంలో సీబీఐకి రాష్ట్ర ప్రభుత్వం ఎంత వరకూ సహకారం అందిస్తుందన్న విషయంలో పొలిటికల్ సర్కిల్స్ లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పొరుగున ఉన్న ఏపీలో వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్నో విధాలుగా అడ్డంకులు సృష్టించడాన్ని వారీ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. ఫామ్ హౌస్ కేసులోనూ తెలంగాణ ప్రభుత్వం కూడా ఫాం హౌస్ కేసు దర్యాప్తు విషయంలో సీబీఐకి అడ్డంకులు సృష్టించే వ్యూహాన్నే అనుసరించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అదే జరిగితే కేంద్రాన్ని ఇరుకున పెట్టాలనుకున్న కేసీఆర్ వ్యూహం పూర్తిగా బూమరాంగ్ అయినట్లేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఫామ్ హౌస్ లో? ముగ్గురు ఎమ్మెల్యేల్ని ప్రలోభపరిచేందుకు బీజేపీ తరపున రాయబారులుగా వచ్చిన ముగ్గురు వ్యక్తులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు చెందిన ఫామ్ హౌస్ లో దొరికిపోయారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసునే ముఖ్యమంత్రి కేసీఆర్ సిట్ కు అప్పగించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి జరిగిన ఈ ప్రయత్నం వెనుక బీజేపీ పెద్ద నేతలున్నారని ఆరోపిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రెస్ మీట్ పెట్టి మరీ ఫాం హౌస్ కేసులో సాక్ష్యాలు ఇవిగో అంటే కొన్ని వీడియోలు, ఆడియోలు మీడియాకు విడుదల చేశారుదేశంలోని అందరు న్యాయమూర్తులకూ పంపారు. మీడియాకు ప్రదర్శించడమే కాకుండా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దగ్గర నుంచి దేశంలోని అన్ని రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల వరకూ అందరికీ పంపారు. ఈ విషయాన్నే ఎత్తి చూపిన తెలంగాణ హైకోర్టు సాక్ష్యాలను అలా ఎలా పంపుతారంటూ సీరియస్ అయ్యింది. ఈ కేసులో సిట్ విచారణ కాదుంటూ.. కేసును.. సీబీఐకి అప్పగించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ కేసీఆర్ సర్కార్ సుప్రీం కు వెళ్లింది. అక్కడా కేసీఆర్ కు చుక్కెదురైంది. దీంతో ఫామ్ హౌస్ కేసులో సీబీఐ దర్యాప్తు చేపట్టడం ఖాయమైంది.

# నాలుగో సారి సీబీఐ విచారణకు అవినాష్ రెడ్డి

**హైదరాబాద్**

వివేకానంద రెడ్డి హత్య కేసులో నాలుగో సారి సీబీఐ విచారణకు వైఎస్ అవినాష్ రెడ్డి హాజరు అయ్యారు. ఈసారి ఆయన ఇద్దరు న్యాయవాదులను వెంట తీసుకొని వెళ్లారు. ఎస్పీ రామ్ సింగ్ ఆధ్వర్యంలో అవినాష్ రెడ్డి విచారణ జరగనుంది. అంతకుముందు అవినాష్ రెడ్డి నేడు తాను విచారణకు రాలేనని సీబీఐకి లేఖ రాశారు. పార్లమెంటు సమావేశాలు ఉన్నందున తనకు విచారణ నుంచి మినహాయింపు ఇవ్వాలని అవినాష్ రెడ్డి లేఖ రాసినా సీబీఐ అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో ఆయన హాజరవ్వాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే సీబీఐ మూడుసార్లు అవినాష్ రెడ్డిని విచారణ చేసింది. గత విచారణ సందర్భంగా కూడా సుదీర్ఘంగానే ఆయన్ను అధికారులు ప్రశ్నించారు. అవినాష్ రెడ్డి సరైన సమాధానాలు చెప్పడానికి ఇష్టపడకపోవడం, పొంతన లేకపోవడంతో నేడు మళ్లీ విచారణకు హాజరుకావాలని సీబీఐ అవినాష్ రెడ్డికి సూచించింది.ఎంపీ అవినాష్ రెడ్డిపై తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చేదాకా చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు సీబీఐని నిన్న (మార్చి 13) ఆదేశించిన సంగతి తెలిసిందే. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన కోర్టు తీర్పును కూడా రిజర్వ్ చేసింది. గత ఆదేశాల మేరకు వివేకా హత్య కేసులో ఎంపీ పాత్రపై



ఆధారాలను సీబీఐ సమర్పించింది. దర్యాప్తు కీలకదశలో ఉన్నందున స్టే ఇవ్వొద్దని వాదించింది. ఇవాళ సీబీఐ విచారణకు మినహాయింపు ఇవ్వాలన్న ఎంపీ అభ్యర్థనను కూడా కోర్టు తిరస్కరించింది. మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో విచారణ ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డ్ చేయాలని, తనపై కఠిన చర్యలు తీసుకోకుండా ఉండటంతో పాటు విచారణకు పిలవకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ కడప ఎంపీ అవినాష్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్పై తెలంగాణ హైకోర్టులో నిన్న విచారణ జరిగింది. జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేశారు. గత విచారణలో కోర్టు ఆదేశాల మేరకు వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డి పాత్రకు సంబంధించిన అన్ని ఆధారాలను సీబీఐ సమర్పించింది.హత్య కేసుకు సంబంధించిన దర్యాప్తు స్థాయి నివేదిక, హార్డ్ డిస్క్, 10 డాక్యుమెంట్లు, 35 మంది సాక్షుల వాంగ్మూలాలతో పాటు.. వివేకా డెత్ నోట్, ఫోరెన్సిక్ నివేదిక, ఘటనా స్థలంలో ఆధారాలు చెరపకముందు తీసిన ఫొటోలు, కేసు డైరీ వివరాలను సీల్డ్ కవర్లో అందజేసింది. హత్యా స్థలిలో సాక్ష్యాల ధ్వంసంలో అవినాష్ రెడ్డి కీలక పాత్ర పోషించారని సీబీఐ తరఫు న్యాయవాదులు అనిల్కుమార్, నాగేంద్రన్ హైకోర్టుకు నివేదించారు. కోర్టు అడిగిన అన్ని పత్రాలను, రికార్డులను సమర్పించామని, దీనిపై త్వరగా తేల్చి దర్యాప్తునకు అనుమతించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దర్యాప్తు కీలక దశలో ఉందని, ఈ సమయంలో నిలిపివేయవద్దని సీబీఐ అధికారులు విన్నవించారు.వివేకా హత్య సమయంలో రాసిన లేఖను ఎఫ్ఎస్ఎల్ కు పంపి నివేదిక తెప్పించి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీబీఐ తెలిపింది. వివేకా రాత నమూనాను పరీక్షించి.. దానికి సంబంధించి ఫోరెన్సిక్ డిపార్ట్మెంట్ వెల్లడించిన అభిప్రాయాన్ని సమర్పించామని పేర్కొంది. ఏ అంశాన్నీ వదిలి పెట్టడం లేదని నివేదించింది. హత్య జరిగిన రోజు 5 గంటల నుంచి 7 గంటల మధ్య ఘటనా స్థలంలో ఆధారాలు ధ్వంసం చేయడానికి అవినాష్ రెడ్డి ప్రయత్నించారని న్నారు. ఈ కేసు గురించి పూర్తి సమాచారం అవినాష్ వద్ద ఉందన్నారు.

# కర్ణాటక మహారాష్ట్ర పాదయాత్ర భక్త బృందాలతో రెండవ విడత సమన్వయ సమావేశం

**స్వచ్ఛంద సేవకులకు లాటరీ ద్వారా సేవా ప్రదేశాల కేటాయింపు**

**శ్రీశైలం**

శ్రీశైలం లో మార్చి 19వ తేదీ నుండి 23 వరకు ఉగాది మహోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భముగా అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ఆయా సౌకర్యాలు కల్పించే విషయమై చర్చించేందుకు మంగళవారం రోజు 14,03,2023 పరిపాలనా భవనములో సమావేశం నిర్వహించబడింది. కర్ణాటక మరియు మహారాష్ట్రలకు చెందిన పలు పాదయాత్ర భక్తబృందాలు మరియు స్వచ్ఛంద సేవాసంస్థల భక్తబృందాలతో రెండవ విడత సమన్వయ సమావేశం నిర్వహించబడింది. ఇప్పటికీ ఈ విషయమై కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతంలోని పలు భక్తసంఘాలు, పాదయాత్ర బృందాలుమరియు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో ఈ నెల 5వ తేదీన బాగల్ కోట్ జిల్లా రబ్బవిలో మొదటి సమన్వయ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. కాగా ఈ నాటి సమావేశంలో బాగల్ కోట్, తుముకూరు, బీజాపూర్ (కుజయపుర) బెళగాని,బసవనగేవాడి తదితర ప్రాంతాలు మరియు మహారాష్ట్రలోని షోలాపూర్, అక్కల్ కోట్ ప్రాంతాలకు చెందిన సుమారు 30 భక్తబృందాలు,పాదయాత్ర భక్త బృందాలు,స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సుదీర్ఘముగా జరిగిన ఈ సమావేశములో ఉత్సవ సంబంధి పలు అంశాలు కూలంకుషంగా చర్చించడం జరిగింది.ఈ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ మొదటి సమన్వయ సమావేశానికి మరియు ధర్మప్రచారంలో భాగంగా అక్కడ జరిపిన ధర్మరథయాత్ర మరియు కల్యాణోత్సవానికి కర్ణాటక మరియు మహారాష్ట్ర భక్త బృందాలు ఎంతగానో సహకరించాయని చెబుతూ



వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఉగాది. ఉత్సవాలలో అయిదురోజులపాటు భక్తులందరికీ శ్రీస్వామివారి అలంకార దర్శనం మాత్రమేకల్పించబడుతుందని, ఉత్సవాల రోజులలో శ్రీ స్వామివారి స్పర్శదర్శనానికి అవకాశం ఉండదని పేర్కొంటూ,ఈ విషయములో భక్త బృందాల ప్రతినిధులు భక్తులలో అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా భక్తులు సేద తీరేందుకు అరుబయలు ప్రదేశాలలో చలువపందిర్లు వేయడం జరుగుతుందన్నారు. అన్ని చలువపందిర్ల వద్ద మంచినీటి సదుపాయం కల్పించబడుతుందన్నారు. క్యూలైన్లలో భక్తులకు నిరంతరం మంచినీరు, అల్పాహారం అందించడం జరుగుతుందని అన్నారు. ఈ వితరణకుగాను స్వచ్ఛంద సేవకులు సేవలను అందించాలన్నారు. ఉత్సవాల సందర్భంగా క్షేత్రపరిధిలో పలు చోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటు చేయబడుతాయన్నారు. అదేవిధంగా దేవస్థానం వైద్యశాల నిరంతరం వైద్యసేవలను అందిస్తుందన్నారు.శ్రీశైలక్షేత్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యకేంద్రం కూడా నిరంతరం వైద్యసేవలు అందిస్తుందని పేర్కొన్నారు.స్వచ్ఛ శ్రీశైలంలో భాగంగా బహిరంగ మలమూత్ర విసర్జనలను క్షేత్ర పరిధిలో నిషేధించడం జరిగిందని, కావున, భక్తాదులందరు దేవస్థానం పలుచోట్ల ఏర్పాటు చేసిన శౌచలయాలలోనే తమ కాలకృత్యాలను తీర్చుకోవాలన్నారు. ఈ విషయమై స్వచ్ఛంద సేవా సంస్థల వారు భక్తులలో మరింత అవగాహన కల్పించాలన్నారు.స్వచ్ఛంద సేవకుల సేవలు ఉగాది మహోత్సవాలలో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన స్వచ్ఛంద సేవకుల సేవలను వినియోగించుకోవడం జరుగుతుంది.ఈ స్వచ్ఛంద సేవకులు స్వామివారి ఆలయం,ముఖమండపం, నంది మండపం,ధ్వజస్తంభం, అమ్మవారి ఆలయం. ఉచిత దర్శనం,శీఘ్ర దర్శనం, అతిశీఘ్రదర్శనం ఉచిత భక్తుల దర్శనానికి వేచి ఉండే క్యూ కాంప్లెక్స్ పుష్కరిణి, గంగాభవాని స్నానఘట్టాలు, పాతాళ గంగ,హఠకేశ్వరం, సాక్షిగణపతి,లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలు,అన్నదానం, వైద్యశాల,పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్,తాత్కాలిక సమాచార కేంద్రాలు తదితర చోట్ల ఆయా సేవలను అందించవలసి ఉంటుంది. స్వచ్ఛంద సేవకులు అందరు కూడా మార్చి 19 నుండి 23 వరకు ఆయా సేవలు అందిస్తారు.స్వచ్ఛంద సేవకులకు సేవా ప్రదేశాల కేటాయింపులో పారదర్శకత కోసం గతంలో వలనే లాటర్ పద్ధతిలో సేవా ప్రదేశాలను కేటాయించడం జరిగింది.మంగళవారం రోజు 14.03,2023 జరిగిన సమావేశంలో హాజరైన స్వచ్ఛంద సేవకుల చేతుల మీదుగానే ఈ లాటర్ ప్రక్రియ చేపట్టబడింది. కాగా సమావేశములో దేవస్థాన పరిపాలన, ఆలయ, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# మార్గదర్శి కార్యకలాపాలపై ఈడి విచారణ జరిపించాలి

**రాజమండ్రి**

మార్గదర్శి చిట్ఫండ్స్లో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు సంబంధించి.. ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ తో దర్యాప్తు జరిపించాలని ఏపీ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్కుమార్ డిమాండ్ చేశారు.రాజమండ్రిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..చిట్స్కు సంబంధించి గతంలో రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ ఇచ్చిన సమాచారాన్ని సీఐడీ అధికారులకు పంపుతున్నానని,ఏపీ చిట్ఫండ్ యాక్ట్ 14(2) ప్రకారం సేకరించిన.. నగదు మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేయాలని,కానీ, మార్గదర్శిలో అలా జరగలేదని ఉండవల్లి వెల్లడించారు.చట్ట విరుద్ధంగా డిపాజిట్దారుల సొమ్మును మ్యూచువల్ ఫండ్స్లో పెట్టుబడి పెట్టారని,మార్గదర్శిలో చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నాయని, 2008 లోనే వట్టి వసంత్కుమార్ ఫిర్యాదు చేశారని ,మార్గదర్శి ఫైనాన్స్ షేర్పై నేను కేసు పెట్టే సమయానికి..1,360 కోట్ల నష్టాల్లో ఉందని ఉండవల్లి వెల్లడించారు.సంస్థ నుంచి కనీస సమాచారం కూడా అధికారులకు ఇవ్వడం లేదని,రామోజీ సెలబ్రిటీ కాబట్టి ఇప్పటిదాకా చర్యలు చేపట్టలేదని,మార్గదర్శి చిట్స్లో జరిగే అవకతవకలపై ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని అన్నారు.

# 'గ్రూప్-1' ప్రిలిమినరీ ప్రశ్నపత్రమూ లీక్

## పరీక్ష రాసిన నిందితుడు!

**హైదరాబాద్**

అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్ష ప్రశ్న పత్రాలు లీకైనట్లు తేలడంతో.. టీఎస్పీఎస్సీ ఇటీవల నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో కూడా గోల్మాల్ జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. గ్రూప్-1 పరీక్ష పత్రాలు లీకై ఉండొచ్చని పలువురు అభ్యర్థులు, నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ప్రభుత్వం గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షా ఫలితాలను వెల్లడించింది. అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్స్కు సన్నద్ధమవుతున్నారు. కాగా.. ప్రస్తుతం ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం టీఎస్పీఎస్సీని కుదిపేస్తుండడంతో గ్రూప్-1 మెయిన్ పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది.టీఎస్పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారం కలకలం రేపుతోంది. ఇప్పటికే ఏపీ పరీక్ష పేపర్ లీక్ కాగా, గ్రూప్-1 ప్రిలిమ్స్ పేపర్ కూడా బయటికెళ్లినట్లు అనుమానాలు కలుగుతున్నాయి. పేపర్ లీకేజీలో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రవీణ్ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రాసినట్లు తెలిసింది. అతడికి 100 పైగా మార్కులు వచ్చినట్లు తెలుస్తుండగా.. ఆ పేపరును అధికారులు పరిశీలిస్తున్నారు. గతేడాది అక్టోబరు 16న జరిగిన గ్రూప్-1 ప్రిలిమ్స్లో 1:50 నిష్పత్తిలో 25,150 మంది మెయిన్స్కు ఎంపికైన సంగతి తెలిసిందే. తెలంగాణలో మార్చి 5న జరిగిన అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగాల రాత పరీక్షను రద్దు చేయాలని టీఎస్పీఎస్సీ భావిస్తోంది. టీఎస్పీఎస్సీలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్కుమార్తోపాటు సిస్టం అడ్మినిస్ట్రేటర్ రాజశేఖర్రెడ్డి అసిస్టెంట్ ఇంజినీర్ ప్రశ్నపత్రాన్ని ఇతరులకు ఇచ్చినట్లు తేలడంతో కమిషన్ ఆ పరీక్షను రద్దు చేయాలని యోచిస్తోంది. ఈ మేరకు మంగళవారం (మార్చి 14) కమిషన్ అత్యవసరంగా సమావేశమై చైర్మన్ జనార్దన్రెడ్డితోపాటు సభ్యులు చర్చించి, అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. పేపరు లీకేజీ వార్తల కారణంగా ఇప్పటికే టీఎస్పీఎస్సీ మార్చి 12న జరగాల్సిన టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ (టీపీబీవో); అలాగే మార్చి 15, 16 తేదీల్లో నిర్వహించాల్సి ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఉద్యోగాలను రద్దు చేస్తున్నట్టు కమిషన్ ప్రకటించింది. అభ్యర్థులకు ఈ సమాచారాన్ని చేరవేసింది. కమిషన్ కార్యాలయంలో సిస్టమ్ను ఎవరో ఓపెన్ చేశారనే సమాచారం వచ్చిన వెంటనే పోలీస్స్టేషన్లో కమిషన్ ఫిర్యాదు చేసింది. మరుసటిరోజే జరగాల్సిన పరీక్షతోపాటు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఉద్యోగాలను సైతం ముందుస్తు జాగ్రత్త చర్యలో భాగంగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ప్రస్తుతం రద్దు చేసిన పరీక్షలను ఏప్రిల్ లేదా మే నెలలో నిర్వహించాలని కమిషన్ భావిస్తున్నది. మంగళవారం జరిగే భేటీలో తదుపరి తేదీలను ఖరారు చేసి.. తేదీల ప్రకటనపై నిర్ణయానికి రానున్నారు.

# పార్లమెంట్ సమావేశాల్లోనూ ఆర్ఆర్ఆర్ సినిమా హాట్ టాపిక్

**న్యూఢిల్లీ**

పార్లమెంట్ సమావేశాల్లోనూ ఆర్ఆర్ఆర్ సినిమా హాట్ టాపిక్ అయింది. ఆస్కార్ వేదిక చరిత్ర సృష్టించిన మన తెలుగు సినిమా ట్రిపులార్ గురించి రాజ్యసభలోనూ ప్రశంసలు వెల్లువెత్తాయి. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్ ఖడ్ ఆర్ఆర్ఆర్ చిత్ర యూనిట్ను అభినందించారు. సభలో ఉన్న సభ్యుల చప్పట్లు కొట్టారు. బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ అవార్డు గెలుచుకున్న 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' టీమ్కు కూడా రాజ్యసభ చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయాలు భారతీయ కళాకారుల అపారమైన ప్రతిభ, అపారమైన సృజనాత్మకత అంకితభావాని తెలియజేస్తాయన్నారు. ఇది అంతర్జాతీయంగా లభించిన గుర్తింపుగా అభివర్ణించారు. అయితే ఈ అంశంపై రాజకీయం కూడా చోటు చేసుకుంది. భారత దేశానికి రెండు ఆస్కార్ అవార్డులు దక్కడంపై రాజ్యసభలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లిఖార్జున్ ఖర్గే స్పందించారు. ట్రిపులార్తో పాటు, ది ఎలిఫెంట్ విస్పర్స్ చిత్రయూనిట్కి ఖర్గే శుభాకాంక్షలు తెలిపారు. అయితే ఈ సందర్భంలో ప్రధాని మోదీకి తనదైన శైలిలో చురకలు అంటించారు ఖర్గే. ఆస్కార్ విజయాలను మోదీ గారు తమ ఖాతాలో వేసుకోకండి అంటూ చమత్కరించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అదానీ విషయంలో పార్లమంట్లో జేపీసీ కోసం పోరాటం చేస్తోంది దీన్ని ఆన్ లైన్లోనూ కొనసాగిస్తోంది. నాటు నాటు పాటలో జూనియర్ ఎన్టీఆర్, రామ్చరణ్ల ఇమేజ్ల స్థానంలో మోదీ అదానీల ఫొటోలను చేర్చి ఆపై లిరిక్స్ నాటు..నాటు స్థానంలో లూటో..లూటో పదాలతో మార్చింది. పార్లమెంట్లో ప్రస్తుతం ప్రకంపనలు సృష్టిస్తున్న అదానీ-హిండెన్బర్గ్ కేసును ప్రస్తావిస్తూ కాంగ్రెస్ తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో ఈ పోస్ట్ను షేర్ చేసింది.

# కర్నూలులో డబుల్ మర్డర్- నవ వధువు దారుణ హత్య

**కర్నూలు**

రెండు వారాల కిందటే పెళ్లయింది. కుమార్తెను అత్తారింటికి తీసుకు వచ్చింది తల్లి. కానీ అలా తీసుకు రావడమే తప్పయింది. ఎందుకంటే ఇప్పుడు కూతురితో పాటు ఆమె కూడా విగత జీవురాలయిది. ప్రమాదంలోనో మరో కారణంమతోనే వీరు ప్రాణాలు పోగొట్టుకోలేదు. వీరిని దారుణంగా హత్య చేశారు. ఈ హ త్యలు చేసింది కూడా ఎవరో కాదు.. రెండు వారాల కిందట పెళ్లి చేసుకున్న కొత్త పెళ్లి కొడుకు.. ఆయన తండ్రి. కాస్త విచిత్రంగా ఉన్న ఈ క్రైమ్ డబుల్ మర్డర్ స్టోరీ ఇప్పుడు సంచలనాత్మకం అవుతోంది. కర్నూలు జిల్లాలో కల్లూరులో ఓ యువతిని, ఆమె తల్లిని ఓ యువకుడు.. అతని తండ్రి దారుణంగా హత్య చేశారు. ఆవేశంలో నరికి హత్య చేశారు. ఆ యువతికి యువకుడితో రెండు వారాల కిందట పెళ్లి అయింది. యువతి స్వస్థతం మహబూబ్ నగర్ జిల్లా నవపర్తి. కర్నూలు జిల్లా కల్లూరులో మంచి సంబంధం అనుకుని రెండు వారాల కిందట పెళ్లి చేశారు. కుమార్తెను అత్తారింట్లో దింపడానికి తల్లి కూడా వచ్చింది. అయితే అక్కడ కుటుంబపరమైన గొడవలు చెలరేగినట్లుగా తెలుస్తోంది. రెండు మూడు రోజులుగా ఇవి తీవ్ర రూపం దాల్చడం యువతి, ఆమెతల్లి అన్ని సమస్యలకూ కారణం అవుతు న్నారన్న ఉద్దేశంతో కొత్త పెళ్లి కొడుకు ఆయన తండ్రి ఆవేశానికి గురై పెళ్లి కుమార్తెను, ఆమె తల్లిని కూడా నరికి చంపినట్లుగా తెలుస్తోంది. నవ వధువు భర్త , మాత కలిసి చంపేయడం సంచలనం సృష్టించింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి.. రెండు మృతదేహాలను పోస్టుమార్టంకు పంపించారు. నిందితులిద్దర్నీ అదుపులోకి తీసుకున్నారు. ఎందుకు హత్య చేయాల్సి వచ్చిందో ప్రశ్నిస్తున్నారు. పెళ్లి సమయంలో జరిగిన గొడవలు అంతకంతకూ పెద్దవై ఇవి హత్యకు దారి తీశాయన్న వాదన వినిపిస్తోంది. తమ కుటుంబంలో మహిళలు ఇద్దర్నీ కొత్తగా సంబంధం కలుపుకున్నవారు హత్య చేయడంతో ఆ మహిళల కుటుంబం షాక్ కు గురైంది.

# పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న 'శాకుంతలం' ... ఏప్రిల్ 14న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్



ప్యాషనేట్ ఎపిక్ ఫిల్మ్ మేకర్ గుణ శేఖర్ దర్శకత్వంలో రూపొందుతోన్న పౌరాణిక ప్రేమకథా చిత్రం 'శాకుంతలం'. ఈ ఎపిక్ లవ్ స్టోరీలో సమంత, దేవ్ మోహన్ జంటగా నటించారు. ఈ విజువల్ వండర్ ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 14న రిలీజ్ అవుతుంది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలం ఆధారంగా శాకుంతలంను రూపొందిస్తున్నారు గుణ శేఖర్. శ్రీ వెంకటేశ్వరక క్రియేషన్స్ దిల్ రాజు సమర్పణలో గుణ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై నీలిమ గుణ ఈ పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 3ఆ టెక్నాలజీతో విజువల్ వండర్‌గా తెలుగు, హిందీ, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో శాకుంతలం సినిమా ప్రేక్షకులను అలరించనుంది. ఈ మూవీ ప్రమోషన్స్‌ను పెద్ద ఎత్తున ప్లాన్ చేస్తున్నారు దిల్‌రాజు, గుణ శేఖర్ అండ్ టీమ్. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పాటలు, టీజర్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ పాన్ ఇండియా రేంజ్‌లో భారీ ఎత్తున ఈ సినిమాను ప్రమోట్ చేయటానికి భారీ ప్లాన్‌ను సిద్ధం చేశారు. రీసెంట్‌గా సమంత, గుణ శేఖర్, దిల్ రాజు సహా టీమ్ సభ్యులందరూ శాకుంతలం ఫస్ట్ కాపీని చూసి హ్యాపీగా ఫీలయ్యారు.

ఈ సందర్భంగా ...నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ "సినిమా అంటే ప్యాషన్ ఉండే ఇద్దరు వ్యక్తులు దిల్ రాజుగారు, గుణ శేఖర్‌గారు కాంబోలో సినిమా వస్తే ఎలా ఉంటుందో అనే దానికి బెస్ట్ ఎగ్జాంపుల్ మా శాకుంతలం. అన్‌కాంప్రమైజ్డ్‌గా నిర్మించాం. మన సినిమా రేంజ్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్లేలా మా వంతు ప్రయత్నం చేస్తున్నాం. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫస్ట్ కాపీ సిద్ధమైంది. టీమ్ అందరం సినిమాను చూశాం. ఔట్ పుట్‌పై చాలా చాలా హ్యాపీగా ఉన్నాం. సినిమా రిలీజ్ కావటానికి ఇంకా నెల రోజులు ఉండగానే ఫస్ట్ కాపీ రెడీ చేశాం. అది కూడా అన్నీ లాంగ్వేజెస్‌లో.. ఇక ప్రమోషనల్ యాక్టివిటీస్ స్టార్ట్ చేయబోతున్నాం. మార్చి 15న పెద్దమ్మ తల్లిని దర్శించుకుని పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రమోషనల్ యాక్టివిటీస్ స్టార్ట్ చేస్తున్నాం. అక్కడి నుంచి కంటిన్యూగా శాకుంతలం సినిమాను పాన్ ఇండియా రేంజ్‌లో జనాల్లోకి తీసుకెళ్లేలా ప్లాన్ చేశాం. ఈ వేసవిలో మా వరల్డ్ ఆఫ్ శాకుంతలం ఫ్యామిలీ ఆడియెన్స్‌తో పాటు చిన్న పిల్లలను సైతం మెస్మరైజ్ చేస్తుంది. ప్రతి ఫ్రేమ్ వావ్ అనిపించేంత గొప్పగా, అందంగా ఉంటుంది. ఏప్రిల్ 14న ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున శాకుంతలం సినిమా రిలీజ్ చేస్తున్నాం" అన్నారు.

మెలోడి బ్రహ్మ మణిశర్మ సంగీతం అందిస్తోన్న శాకుంతలం చిత్రానికి సాయి మాధవ్ బుర్రా సంభాషణలు అందించారు. శేఖర్ వి.జోసెఫ్ సినిమాటోగ్రఫీ అందిం,గా ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు.

సమంత, దేవ్ మోహన్ జంటగా నటించిన శాకుంతలం చిత్రంలో డా.ఎం.మోహన్ బాబు, ప్రకాష్ రాజ్, మధుబాల, గౌతమి, అదితి బాలన్, అనన్య నాగళ్ల, జిస్సు సేన్ గుప్తా కీలక పాత్రలను పోషించారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కుమార్తె అల్లు అర్హ యువరాజు భరతుడి పాత్రలో నటించటం వన్ ఆఫ్ ది హైలైట్.













Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950